# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక



సంపుటి: 26 సంచిక: 05 హైదరాబాద్ సెప్టెంబర్ 2026 పేజీలు: 40

Please visit : www.srimeherbaba.com విడిప్రతి 20/-







హనుమాన్ మందిర్, సూప





# యాత్ర ... హ్యాపీవ్యాలీ, సూప.,

వార్తా వ్యాఖ్య 26 –31 పేజీలలో

ఫోటోలు: మెహెర్ జల్లు

## బాబా సందేశం

**భౌతిక ప్రపంచం నుంచి తప్పించుకొని అనంతమైన** సూక్ష్మ శరీరధారణ చేయాలంటే, మరణం తప్పదు. చావుతో ఆత్మ గూడు మారుతుంది. ఓ కోటు విప్పేసి, మరో కోటు తొడుక్కోవటం వంటిది మరణం. నాటకంలో, ఒకే నటుడు ఎన్నిరకాల బట్టలు మారుస్తాడు. తెర దింపగానే పాంటూ, షర్టూ మార్చుకోడూ! ఒకే నటుడు అనేక నాటకాల్లో రకరకాల పాత్రలు ధరించడూ! అంతే!

**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**శ్రీ దశిక ప్రసాదరావు**

## లోపలి పేజీలలో...

| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం | 5 |
| 2. | జేమ్స్‌తో మాటా – మంతీ | 6-11 |
| 3. | న్యూ లైఫ్ సర్క్యులర్స్ | 12-13 |
| 4. | నవజీవనం | 14-15 |
| 5. | శంకుస్థాపన కోసం రాయి | 16-17 |
| 6. | మెహెరాజాద్ గృహప్రవేశం | 18-19 |
| 7. | మెహెరీశం | 20-23 |
| 8. | ఆ బస్సులో నేనూ వున్నాను | 24-25 |
| 9. | మెహెరాబాద్ నుండి యాత్ర | 26-31 |
| 10. | బాబాలో ఐక్యం | 32 |
| 11. | మా మాటలు | 33-39 |
| 12. | జీవితసభ్యులు | 40 |

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

**ముఖ చిత్రం**
**1951 మే మాసంలో**
**మహాబళేశ్వర్‌లో అవతారుడు**

**మనవి**

**మీ వ్యాసాలు, ఇతర సమాచారం మాకు ప్రతినెల 10వ తేది లోపల పంపవల్సింది. మెహెర్‌బాబా పత్రికను ప్రతినెలా 26న హైదరాబాద్‌లో పోస్టు చేస్తున్నాం.**

# మనోనాశ్ - అమృతోత్సవాలు

**అవతారుడు మనోనాశ్ కార్యక్రమం చేపట్టి 2026 అక్టోబరు నాటికి 75 సంవత్సరాలు నిండుతున్నాయి.** 1949 అక్టోబర్ 16న బాబా నవజీవనం ప్రారంభించిన విషయం పాఠకులకు తెలుసు. నవజీవనానికి ముగింపుగా 1951 అక్టోబరు 16 నుండి 23 దాకా ఖాజాగూడ కొండపై వున్న చిన్న గుహాలో మెహెర్‌బాబా **మనోనాశ్** కార్యక్రమాన్ని నిర్వహించారు. 1951 అక్టోబరు 24న హైదరాబాద్ నుండి కాలినడకన మెహెరాబాద్‌కి బయల్దేరారు. ఈ సందర్భంగా, హైదరాబాద్‌లో రెండు రోజుల మనోనాశ్ అమృతోత్సవ వేడుకలు 2026 అక్టోబరు 17న జూబ్లి బాబా కేంద్రంలో, అక్టోబరు 18న మనోనాశ్ గుహ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. బాబా ప్రేమికులు పెద్దసంఖ్యలో పాల్గొన వల్సిందిగా నిర్వాహకులు కోరుతున్నారు. దూరప్రాంతాల నుండి విచ్చేయు వారికి తగిన వసతి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు వాట్సప్ నంబర్లు - 9849046848, 9652422599, 9396702076, 924652609 సంప్రదించగలరు.

# రామాయంపేట కేంద్ర 34వ వార్షికోత్సవం

**రామాయంపేట బాబా కేంద్ర 34వ వార్షికోత్సవం సందర్భంగా 2026 నవంబరు 29** ఆదివారం ప్రత్యేక ప్రేమిక సమ్మేళనం ఏర్పాటుచేసినట్లు శ్రీ రామచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులు పెద్దసంఖ్యలో హాజరుకావల్సిందిగా ఆయన కోరుతున్నారు. మరిన్ని వివరాలకు 98494 94040, 99665 59479 సంప్రదించగలరు.

# గర్గుల్ కేంద్ర 34వ వార్షికోత్సవం

**గర్గుల్ బాబా కేంద్ర 34వ వార్షికోత్సవం సందర్భంగా 2026 అక్టోబరు 4వ తేదీ, ఆదివారం** ప్రత్యేక ప్రేమిక సహవాస్ ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులు పెద్ద సంఖ్యలో హాజరు కావల్సిందిగా ఆయన కోరుతున్నారు. మరిన్ని వివరాలకు 94404 14294, 94418 62937 సంప్రదించగలరు.

# మెహెర్‌బాబా పత్రిక కోసం

**మెహెర్‌బాబా పత్రిక నిర్వహణ కోసం 2026 ఆగస్టు/సెప్టెంబరు నెలలలో**

1. డాక్టర్ జయసూర్య, హైదరాబాద్ రూ. 2,000/-
2. శ్రీ యం. ముత్యాలరావు, పద్మారావ్‌నగర్,సికింద్రాబాద్ రూ. 1000/-

పంపినారు. వీరికి పత్రిక పక్షాన ధన్యవాదములు, జైబాబా

సంపాదకీయం

# స్మరణార్థం



**శ్రీ మల్లాది రామారావు 2026 సెప్టెంబరు 7న బాబా నామస్మరణతో అవతారునిలో ఐక్యమయ్యారు.** బాబా ప్రేమికులందరికీ ఆయన సుపరిచితుడే. మెహెర్‌బాబాని దేవదేవుడిగా నమ్మిన వ్యక్తి. మలకపల్లి జెడ్‌పి హైస్కూల్లో యస్.యస్.ఎల్.సి. పూర్తయ్యాక, 1965లో వీరి కాలేజి చదువు కోసం తండ్రి శ్రీ మల్లాది గోపాలకృష్ణమూర్తి కొవ్వూరు నుంచి నరసరావుపేటకు బదిలీపై వచ్చారు. ఇక్కడ వుండగానే, బాబా గురించి తెలుసు కున్నారు. తొలినాళ్ళలో అన్యమనస్కంగా బాబా సత్సంగ్‌లకు వెళ్ళినా, 1968లో రామారావ్ డిగ్రీ పూర్తయ్యేనాటికి, వారింట్లో అందరూ బాబాకి సంపూర్ణంగా అంకితమయ్యారు. 1969 ఫిబ్రవరి 1న బాబా భౌతిక దేహత్యాగం చేశారని తెలిసిన వెంటనే, ఇంట్లో ఎవరికీ చెప్పకుండా, మెహెరాబాద్‌లో అవతారుని దర్శనం చేసుకున్న ధన్యుడు శ్రీ మల్లాది.

**జర్నలిజం ఆయన వృత్తి, అదే ప్రవృత్తి కూడా. ఆంధ్ర, ఆంగ్ల భాషలపై అసాధారణ పట్టున్న** శ్రీ రామారావు పలు ప్రముఖ పత్రికల్లో పనిచేశారు. గొప్ప అనువాదకుడిగా కీర్తి గడించాడు. 2005 జనవరి నుండి 'మెహెర్‌బాబా' మాసపత్రికలో 'మెహెరీశం' శీర్షికతో ఒక అనుసృజన అనువాద ధారావాహికను అందించారు. ఈ మహా ఇతిహాసంలో 1925 నుండి 1932 నడుమ జరిగిన అనేక చారిత్రాత్మక సంఘటనలను రెండు వాల్యూంలలో ప్రచురించారు.

**మెహెరీశం కోసం ప్రతినెలా పత్రికలో ముద్రణ కోసం నాలుగైదు పేజీలకు మాత్రమే రాసి పంపే** శ్రీ రావు, ఆశ్చర్యకరంగా 2026 ఆగస్టు చివరి వారంలో సుమారు 300 పేజీల వ్రాతప్రతులను పత్రికకు అందజేశారు. గతంలో సంచిక గడువులోగా మేటర్ అందుతుందో లేదో అని నిరీక్షించాల్సి వచ్చేది. అంతేకాదు, ఆగస్టు 17న ఎం.పి. ఆర్.లో జేమ్స్ న్యూవెల్‌తో జరిపిన ఇంటర్వ్యూని తానే స్వయంగా రాస్తానని ఇష్టపడ్డారు. అంతక్రితం రోజుననే, అవతారుని నవజీవన యాత్రలో తొలి మజిలీ చేసిన సూపా సందర్శించాలని తహతహలాడారు. జీవిత చరమాంకం వరకు బాబా ఆలోచనలతో, బాబా సాహిత్య సేవలో గడిపిన శ్రీ మల్లాది, అనాయాసంగా తుదిశ్వాస విడిచారు.

**మెహెర్‌బాబా పత్రికతో శ్రీ రామారావు గారికి రెండున్నర దశాబ్దాల అనుబంధం వుంది. నేడు ఆ లోటుని ఎవరూ భర్తీచేయలేరు. నివాళులు.** ❈

# మెహెరా - మెహెరీశం
# కాదు శారీరక బంధం

**మెహెరా మాయి : డాక్టర్ జేమ్స్ ఆర్ న్యూవెల్‌తో మాటా - మంతీ**

**(మల్లాది రామారావ్, మెహెరాబాద్)**




**"నన్ను ప్రేమించవలసిన రీతిలో నన్ను ప్రేమిస్తుంది మెహెరా"** అనేవారు బాబా. యావత్తు విశ్వంలో ఒక పరిశుద్ధ ఆత్మ మెహెరా అని బాబా అన్నారు. ఆమె "నా రాధ" "ఆమె నా శ్వాస" అని కూడా బాబా అభివర్ణించారు. మెహెరీశుని ఎలా ఆరాధించాలో, మెహెరాను చూసి నేర్చుకోవాలని పెద్దలు అంటారు. గమ్మత్తు ఏమంటే, **మెహెరా గురించి అంతగా తెలీదు బాబా కొంగు పట్టుకొన్న వారికి కూడా.**

**ఆమెపై రెండు పుస్తకాలు వచ్చాయి. 'మెహెరా' అన్న పుస్తకం 80వ దశకంలో వస్తే,** మెహెరా – మెహెర్ అన్న ఉద్గ్రంథం 90వ దశకంలో వచ్చింది. అయినా కూడా మెహెరా గారి గురించి ఇంకా తెలుసుకోవాలసింది ఎంతో వుందన్న భావం మాత్రం పోలేదు.

**బాబా వారిని దుమ్మెత్తి పోసిన కల్నల్ ఇరానీ గారి మేనకోడలు మెహెరా. మెహెరాబాద్** తొలినాళ్ళల్లో, మెహెరా పురుషులకి దూరంగా వుండేది. వంటగదిలో కూడా పురుషుల పేరు ప్రస్తావనకి రాకూడదు మెహెరా ఆ చుట్టుప్రక్కల వుంటే. ఇదీ మెహెరీశుని ఆదేశం.

**బాబా వారు మరో ఒకటి రెండేళ్ళకి శరీరం వదిలేస్తారనే సమయానికి మెహెరా నలుగురితో** కలివిడిగా తిరగసాగింది. తొలి అమరతిథి తర్వాత సమాధికి వస్తున్న వారినీ, మెహెరాజాద్‌కి వస్తున్న వారినీ కలిసేది. బాబాపై గురిపెట్టెమనీ, బాబా కొంగు వదిలి పెట్టవద్దనీ హితబోధ చేసేది. 1975 అమరతిథికి వెళ్ళినప్పుడు మెహెరాని కలిసే అదృష్టం నాకు దక్కింది. అమరతిథి మూడవ రోజున సమాధి నుంచి రిట్రీట్‌కి వెడుతూ, గేటు దగ్గరగా వున్న నన్ను, నా మిత్రుడిని చూసి పలకరించింది. 'బాబా దేవదేవుడు మరచిపోకు. నామస్మరణ నిత్యం చేయి" అని హితవాక్యం చెప్పింది మెహెరా. మెహెరా బాబా వారిని ఆరాధించింది, ప్రేమించింది, గాఢంగా నమ్మింది మెహెరా అని వినటమే తప్ప, అది ఏ తీరుగా వుండేదో

తెలీదు ఎవరికీ. ఈ భోగట్టా లోటుని తీర్చాడు ఒక అమెరికన్ ప్రేమికుడు. అతని పేరు జేమ్స్ న్యూవెల్. రచయిత, కవి, గాయకుడు. అన్నింటినీ మించి మంచి వక్త. ఇతగాడు 1979 నవంబరులో మెహెరాబాద్, మెహెరాజాద్‌లకి వచ్చాడు. 1969 దరిమిలా వచ్చిన అమెరికన్లని 'ఫస్ట్‌వేవ్' అంటారు. వాళ్ళ పుణ్యమే ఏరుచ్, మణిల కథలు, మండలి కబుర్లు. **జేమ్స్** అదృష్టమనండి, మన అందరి అదృష్టమనండి, అతని పాటలు మెహెరాకి ఎంతో ఇష్టం. **జేమ్స్**, అతని భార్య, మెహెరీశుని రాధ ముంగిట కూర్చుని భక్తి గీతాలు పాడేవారు. మెహెరాకి ఇష్టమైన యాభయికి పైగా భజన గీతాలని స్వరపరిచాడు **జేమ్స్**. ఈ మాట ఆయనే చెప్పాడు స్వయంగా ఇటీవల మెహెరాబాద్‌కి వచ్చినప్పుడు. ఇప్పుడతను వొంటరి వాడు. భార్య గతించి నాల్గేళ్ళవుతోంది.

## మెహెరా ఆదేశం

**భార్య మాట పెడచెవిన పెడతారు అమెరికన్లు అనుకో వద్దు. మేం భార్య మాట వింటాము** అంటాడు నవ్వుతూ. ఈ మాట ఎందుకు అన్నాడంటే, మెహెరా ఇతనికో ఆదేశం ఇచ్చింది. నలుగురికీ చెప్పమంది తన మాట. కానీ ఎందుకనో ఆ మాట తన నోట దాటలేదుట. అమెరికాలో ఏదో వొకటి రెండుసార్లు ఇద్దరు ముగ్గురితో అన్నా మెహెరా ఆదేశం నా వరకే పరిమితమైంది. నా భార్యకి నచ్చలేదు నా ధోరణి. నలుగురికి చెప్పు మెహెరా మాట అనేది. ఇదిగో ఇంతకాలనికి ఆ శుభ గడియ వచ్చినట్లుంది అంటూ **జేమ్స్** అలనాటి మెహెరా మాటని 2026 ఆగస్టు మూడో వారంలో పిలిగ్రిమ్ రిట్రీట్ వేదికపై వెల్లడించాడు.

ఇంతకీ ఆ మాట ఏమిటి? అది ఎప్పటిమాట? 1985 అమరతిథి నాటి సంగతి అది. మండలి హాలులో అందరూ కూర్చొన్నారు. **జేమ్స్** పాట పాడాడు. మెహెరా జన్మదిన కానుకగా వ్రాసిన పాట అది.

**"బాబాని ఎలా ఏ ప్రకారంగా ప్రేమిస్తున్నావు మెహెరా" అంటూ సాగుతుంది పల్లవి.**
**'మాకు చెప్పవూ, నువ్వు ఎలా ప్రేమిస్తున్నావో', అన్నది, అనుపల్లవి.**

మెహెరాకి నచ్చిందీ పాట. **జేమ్స్** గిటారుపై పాడిన పద్ధతికి అందరూ శెహబాష్ చెప్పారు. కరతాళ ధ్వనులు మారుమోగాయి. నా పాట నచ్చినందుకు సంతోషం. కానీ, మెహెరా జన్మదినోత్సవం కోసం వ్రాయలేదు, మెహెరా వివాహ వార్షికోత్సవ కోసం వ్రాశానన్నాడు జేమ్స్. ఒక్కసారి మండలి హాలులో అందరూ స్థాణువులై పోయారు. ఏమిటీ ఈ అతివాగుడు అనుకొన్నారు శ్రోతలు కొంతమంది. మెహెరా ఏమనుకొంటోందో? ఆమె కేసి తేరిపార చూశారు. ఆమె ముఖంలో ఏ మార్పు కనబడలేదు. ఎంత పొరపాటు

చేశానని తల పట్టుకున్నాడు **జేమ్స్**. ఆ మర్నాడు ఉదయం మెహెరాబాద్‌కి వచ్చింది మెహెరా. వెంట స్త్రీ మండలి వచ్చారు. ప్రార్ధనలు తర్వాత బాబా వారి టిన్ షెడ్‌కి వెడ్తూంటే, **జేమ్స్** కనిపించాడు. భయం, భయంగా నిలబడ్డాడు దూరంగా. మెహెరుడి దగ్గర భయం దేనికి, ధైర్యంగా బాబా బాటలో నడవాలి కానీ అని మెహెరా అంటోందా అనిపించింది ఆమెను చూస్తుంటే.

**జేమ్స్‌ని దగ్గరకు రమ్మన్నది మెహెరా. చాలా థ్యాంక్స్ సోదరా నా పుట్టినరోజుకి చక్కటి పాట** వ్రాశావు అని కితాబు ఇచ్చింది. **జేమ్స్**కి ఆశ్చర్యం వేసింది. రెండు మొట్టికాయలు వేస్తుంది, శిక్షిస్తుందనుకొన్న మెహెరా, మెచ్చుకొంటోంది ఏమిటి అనుకొన్నాడు. అందుకనే మనసులో మాట నెమ్మదిగా చెప్పబోయాడు. అతని మాటలకి అడ్డుపడింది.

**"నా పెళ్ళిరోజు కోసం రాసిన గీతం అన్నందుకా సారీ చెప్తున్నావు అన్నది నవ్వుతూ. అలా** నువ్వు పాట కట్టినందుకు ఎంత సంతోషంగా వుందో చెప్పలేను", అన్నది. **జేమ్స్**కి నోట మాట రాలేదు. తాను వింటున్నది నిజమేనా? నా తప్పుకి శిక్ష విధించదా మెహెరా అనుకొన్నాడు.

## పెళ్ళి రోజు

**జేమ్స్ మనోభావాలు తెలియకపోతే కదా మెహెరాకి. ఆమె ఏమన్నది అంటే - బాబా వారి** సమక్షంలో నా పుట్టిన రోజు ఎప్పుడు జరిగినా, అది బాబా వారితో పెళ్ళి రోజు క్రిందే లెక్క నాకు అన్నది. 'ప్రభువే స్వయంగా చేయించేవారు నా జన్మదిన వేడుకల్ని ఘనంగా. నేను అందంగా ముస్తాబయ్యేదాన్ని ఆవేళ. మంచి బట్టలు వేసుకొనేదాన్ని అంటూ మెహెరా గతాన్ని గుర్తుచేసుకొంటూ, ఇంకా ఏమన్నారో తెలుసా అన్నాడు **జేమ్స్.**

**ఏమని ఉంటారు మెహెరా అన్న ఉత్కంఠత కల్గింది శ్రోతలు అందరిలో. అప్పటికి వో గంట** సేపటి నుంచి మెహెరా జ్ఞాపకాలు పంచుకొంటున్నాడు. ఆమె నచ్చిన, మెచ్చిన పాటలు పాడుతున్నాడు. 'ఇహ త్వరగా ముగించు నీ ఉపన్యాసం. ఇరవై నిమిషాల వ్యవధి ఇస్తున్నాం', అన్నారు సభా నిర్వాహకులు. సరే అయితే ఎక్కువసేపు తీసుకోను అంటూ మెహెరా కథలోకి వెళ్ళాడు **జేమ్స్**. మెహెరా పరాయి పురుషుడితో మాట్లాడినట్లు లేదు. తోటి ఆడపిల్లతో సరదగా చిలిపిగా మాట్లడుతున్నట్లు అన్నది. నేను అవాక్కు అయ్యాను. అచేతనంగా నిలబడి పోయాను కాసేపు.

**ఇంతకీ మెహెరా ఏమన్నారు?**

**'బాబావారితో ఎలాంటి శారీరక సంబంధం లేదు నాకు", అన్నారు.**

**ఈ మాట నాతో ఎందుకంటున్నారో అర్థం కాలేదు.**
**తమ పట్ల బాబా వారి ప్రేమ చాలా స్వచ్ఛమైనదన్నారు.**

ఈ సత్యాన్ని ప్రతి పురుషుడు తెలుసుకోవాలి అంటూ టిన్ షెడ్ వైపు కదిలారు మెహెరా. చెప్పానుగా తప్పు చేశానన్న గిల్టీ ఫీలింగ్ కృంగ తీస్తోంది నన్ను వో ప్రక్క. మెహెరా ఏమో ఇలా వో ఆదేశం యిస్తున్నారు. ఎందుకు నాకీ ఆదేశం అని అడుగుదామనిపించిందా? అబ్బే! లేదు. మెహెరా ఎవరు? బాబావారి ప్రతిరూపం. ఆమె ప్రతిమాట మన అందరికీ శిరోధార్యం. ఆమె నడిచిన బాటలో నడిచి మెహెరీశుని ప్రేమకి పాత్రులం కావాలి మన మందరం.

**ఇది 1985 నాటి మాట. ఈ వేళ ఆగస్టు 16 (2026) అంటే నలభయి సంవత్సరాల పైనే** అయింది మెహెరా ఉవాచ విని. నా భార్య చాలాసార్లు హెచ్చరించింది. మెహెరా మాట నేటి మెహెర్ సమాజానికి, ముఖ్యంగా మగవారికి తెలియాలి అనేది. వాస్తవాలు తెలియకపోతే, పుకార్లు, నీలి వార్తలు పుట్టుకు వస్తాయి. వాటికి ఆస్కారం లేకుండా చేయాలంటే, మెహెరా మాట నలుగురికీ తెలియాలి అనేది నా శ్రీమతి.

**నిజమే. కాదనలేం. మెహెరీశంలో ఏ పని ఎప్పుడు ఎలా జరగాలో అవతారుడే నిర్ణయిస్తాడు.** బహుశా మెహెరా మాట బయటపెట్టటానికి తగిన సమయం ఇదేనేమో! జేమ్స్ స్వగతం ఆపాడు. చప్పట్లతో హాలు దద్దరిల్లింది. అవతార్ మెహెర్‌బాబాకీజై! మెహెరా మాయికీ జై! నినాదాలు మారుమ్రోగాయి. ❋

**డాక్టర్ జేమ్స్ ఆర్ న్యూవెల్ గురించి క్లుప్తంగా ప్రక్క పేజీలలో తెలుసుకుందాం**



## శ్రీమతి కోటేశ్వరమ్మ బాబాలో ఐక్యం

**హైదరాబాద్ ప్రేమికులు శ్రీ జి. అజయ్ బాబు గారి** తల్లి శ్రీమతి కోటేశ్వరమ్మ అకస్మికంగా స్వల్ప అస్వస్థతతో 2026 సెప్టెంబరు 2న బాబా పాదాల వద్దకు చేరుకున్నారు. ఆమె తన తీరిక సమయమంతా అవతారుని నామస్మరణలో గడిపే వారు. చిన్నా పెద్ద అందర్నీ ఎంతో ఆప్యాయంగా పలకరించేవారు. ఆమె మృధు స్వభావి, నిస్వార్థ బాబా ప్రేమికురాలని స్థానిక బాబా ప్రేమికులు ఆమెకు తమ ఘనమైన నివాళులర్పించారు. అవతారుడు ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలని సికింద్రాబాద్, జూబ్లి, కోఠి, మల్కాజ్‌గిరి బాబా కేంద్రాలలో ప్రార్థనలు, కొద్దిసేపు మౌనం పాటించారు.

## పరిచయం క్లుప్తంగా..,

# డాక్టర్ జేమ్స్ ఆర్ న్యూవెల్




**ఈయన్ని క్లుప్తంగా జేమీ అని** పిలుస్తారు. అమెరికా నివాసి. ప్రస్తుతం మెర్టిల్‌బీచ్ బాబా కేంద్రంలో వుంటున్నారు. ఇటీవల ఆయన మెహెరాబాద్‌లో కొన్ని రోజులు బస చేశారు. ఆ సమయంలోనే అంటే, 2026 ఆగస్టు 16న యంపిఆర్‌లో వీరి మాట – పాట కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆనాడు ఆ కార్యక్రమంలో జేమీ చాలా అరుదైన మాటలు చెప్పాడు. గత అర్థ శతాబ్దానికి పైగా ఈ సమాచారం ఎవరికీ తెలియదు. అందుకు కారణం కూడా జేమీ స్పష్టంగా ముందు పేజీలలో చెప్పాడు. ఆ పిదప, ఒక రోజున డాక్టర్ జేమీ టైం తీసుకుని, శ్రీ మల్లాది రామారావు గారితో కలిసి ఆయనతో మాటా – మంతీగా కొన్ని నిముషాలు మాట్లాడాం.

**జేమీ గొప్ప సంగీత కళాకారుడు. అతని స్వర మాధుర్యం చాలా ప్రత్యేకంగా ఉంటుంది.** జెమీ స్వీయ రచనలో వెలువడిన **'ఉస్తాద్ ధన్యవాద్'** గీతాన్ని ప్రతిఒక్కరూ తప్పక ఆలకించాలి.

**జేమీ న్యూవెల్ 1973 – 74వ సంవత్సరాలలో తొలిసారిగా మెహెర్‌బాబా గురించి తెలుసుకున్నాడు.** ఏసుక్రీస్తు తన ఆరాధ్య దైవం అంటాడు. నేడు ఏసుని బాబాలో దర్శించు కుంటున్నానని చెప్పాడు. ఇందుకు ప్రధాన కారణం మెర్టిల్‌బీచ్ బాబా కేంద్రంలోని బాబా ప్రేమికులు డార్విన్ షా, కిట్టీ దేవి, ఎలిజబెత్ పాటర్‌సన్‌లతో పరిచయమేనని పేర్కొంటాడు. బాబా వారి 'డిస్కోర్సెస్' గ్రంథాన్ని ఆసాంతం చదివాక బాబాపై తనకు తెలియకుండానే గురి కుదిరిందని చెప్పాడు. ఆ తర్వాత మెర్టిల్‌బీచ్‌కి వచ్చిన బాబా వారి కార్యదర్శి ఆదీ కె. ఇరాని ప్రసంగాలు విని, 1979 నవంబరులో తొలిసారిగా మెహెరాబాద్, మెహెరా జాద్‌లను సందర్శించాను. ఈ సమయంలోనే మెహెరాజాద్‌లో మెహెరా మాయిని తొలిసారిగా కలుసుకున్నాను. మీలో చాలా మంది మెహెరా మాయిని కలిసి ఉండవచ్చు. ఐతే, మెహెరా మాయితో నా ఆధ్యాత్మిక అనుబంధం, ఆ జ్ఞాపకాలు చాలా ప్రత్యేకం.

**ఆ దరిమిలా 1979 నుండి 1989 మే 20న ఆమె అవతారునిలో ఐక్యమయ్యేంత వరకూ,** నేను, నా భార్య మెహెరా మాయిని ఆరుసార్లు మెహెరాజాద్‌లో కలుసుకున్నాం. ఆమె సమక్షంలో పలుమార్లు బాబా భజన గీతాలను ఆలాపించాను. నేను తొలిసారిగా మెహెరా మాయిని మెహెరాజాద్‌లో కలిసినప్పుడు, నా స్వీయ స్వరకల్పనలోని ఒక గీతాన్ని మెహెరా ఎదుట గానం చేశాను. పశ్చిమ దేశాల ప్రేమికుల గాత్రం సున్నితంగా, చిన్నగా వినబడుతుందని, మండలి వారు నన్ను ఆమెకు చాలా దగ్గరగా కూర్చుని పాడే అవకాశం ఇచ్చారు. ఆనాడు నేను I dont care where they bury my body అనే పాటను పాడాను.

**ఈ పాట ఆమెకు బాగా నచ్చింది. ఆపై నన్ను అభినందిస్తూ కొన్ని సూచనలు చేసింది. నేను** పాడే పాటలను ఒక కాగితంపై రాసి ఇస్తే, ఆ గీతాలలోని భావార్థాన్ని అర్థం చేసుకునే వీలుంటుందని చెప్పింది. అలాగే, ప్రతి పాటలో బాబా నామం తప్పకుండా వుండాలని సూచించింది. బాబా పేరులేని పాటలను తాను ఇష్టపడననీ స్పష్టంగా చెప్పింది.

**ఆ తర్వాత ఆమెకు ఇష్టమైన రీతిలో సుమారు 50కి పైగా బాబా భజన గీతాలను నేను స్వర పరిచి, పలుమార్లు గానం చేశాను.** అంతేకాదు, నేను పాడిన పాటలను రికార్డు చేసి అమెరికా నుండి పంపితే, ఇక్కడ వాటిని ఆమె టేప్ రికార్డర్‌లో విన్నారని చెప్పారు. ఆ తర్వాత, పలుమార్లు నన్ను అభినందిస్తూ మెహ్రూ చేత ఆమె నాకు లేఖలు రాయించారు. అదంతా నా అదృష్టంగా భావిస్తాని, స్వగతం ముగించారు జేమీ.

**డాక్టర్ జేమ్స్ న్యూవెల్ 2026 ఆగస్టు 16న యంపిఆర్‌లో చేసిన ప్రసంగ పాఠవాన్ని యూట్యూబ్ రికార్డుని మెహెర్‌బాబా మాస పత్రిక వాట్సప్ గ్రూప్‌లో తిలకించగలరు.**

**– ఎడిటర్**




## మెహెర్‌బాబా మండలి

ఎగువ మెహెరాబాద్‌లో స్త్రీ మండలి, దిగువ మెహెరాబాద్‌లో పురుష మండలి వారి సమాధులు వున్నాయి. ఈ అద్వితీయ భాగవతోత్తముల జీవిత రేఖా చిత్రాలతో 'మెహెర్‌బాబా మండలి' శీర్షికతో ఒక ప్రత్యేక గ్రంథంగా ప్రచురిస్తున్నాం. మా ఈ ప్రయత్నం తుది దశకు చేరుకుంది. త్వరలో మీకు అన్ని వివరాలు తెలియజేస్తాం. జైబాబా.

# న్యూ లైఫ్ సర్క్యులర్స్

## ప్రేమిక పాఠక లోకానికి ఇవొక అమూల్య సమాచార భండాగారం

**మెహెర్‌బాబా నెరపిన నవజీవన సమయంలో 1949 అక్టోబర్ 28 – 1952 ఫిబ్రవరి 01** నడుమ వరుసగా మొత్తం 34 "న్యూ లైఫ్ సర్క్యులర్లు", అవతారుని ఆదేశాలతో జారీ చేశారు. బాబా వారి కార్యదర్శి ఆదీ. కె ఇరాని ఈ సర్క్యులర్స్‌ను మెహెర్ పబ్లికేషన్స్, అహమ్మద్‌నగర్ తరపున ఎప్పటికప్పుడు విడివిడిగా ప్రచురించారు.

**1949 అక్టోబర్ 16న, 20 మంది సహచరులతో మెహెర్‌బాబా 'న్యూ లైఫ్'ను ప్రారంభించారు. బాబా వారి నవజీవన సమయంలో** బాబా గురించిన సమాచారం బొత్తిగా తెలిసే అవకాశం లేదు. బాబా వారి దర్శన భాగ్యం ఎప్పుడు లభిస్తుందో తెలియని రోజులవి. ఇది బాబా అనుచరగణానికి అశనిపాతమే.

## సర్క్యులర్‌లు – సమాచార వారధిగా

**ఐతే ఆ పిదప, బాబా నవజీవనం గడిపిన రెండున్నర సంవత్సరాల కాలంలో, నెలకు** సగటున ఒకటి చొప్పున, బాబా – సహచరుల కార్యకలాపాలను స్పష్టంగా తెలిపేలా "సర్క్యులర్లు" విడుదల చేశారు. ఆనాడు ఈ సర్క్యులర్లు బాబా ప్రేమికులందరికీ ఒక చక్కని సమాచార వారధిలా పనిచేశాయి. ఈ సర్క్యులర్లను ఒక వరుస క్రమంలో (01 నుండి 34 వరకు), జారీ చేసిన తేదీలతో స్పష్టంగా విడుదల చేశారు. వీటిల్లో బాబా స్వయంగా చెప్పిన మాటలు ఉన్నాయి. కొన్ని సర్క్యులర్లు కేవలం ఒక పేరా మాత్రమే ఉండగా, మరికొన్నింటి నిడివి విస్తారంగా ఉండింది. అధిక శాతం సర్క్యులర్లు ఇంగ్లీషు టైపింగ్ రూపంలో జారీ చేశారు.

**సర్క్యులర్ నంబరు 05లో 'నూతన జీవనం' గురించి బాబా చేసిన ప్రకటన, సర్క్యులర్** నంబరు 17 అనుబంధంలో మహాబలేశ్వర్‌లో బాబా వారిచ్చిన ప్రసంగం, 1951 మే, జూన్‌లలో మహాబలేశ్వర్ – హైదరాబాద్‌ల నుండి బాబా జారీ చేసిన ప్రకటనలు, డిక్లరేషన్లు, వివరణలు, అనుబంధ సూచనలు పాఠకులకు విశేష సమాచారం అందిస్తున్నాయి. కొన్ని సర్క్యులర్లలో నవజీవన ప్రణాళికలు, షెడ్యూళ్లు, నిబంధనల గురించిన సమగ్ర సమాచారం లభిస్తుంది. ఆ కోవలో సర్క్యులర్లు క్రమసంఖ్య 4, 5లలో వివరించిన మూడు 'నూతన జీవన' ప్రణాళికలు, సర్క్యులర్ 8లో, 1950 ఏప్రిల్‌లో డెహ్రాడూన్‌లో బాబా వారిచ్చిన 'కొత్త ప్రణాళిక' **(New Plan)** నిశితంగా పరిశీలించాల్సిన అవసరం వుంది. డాక్టర్ ఘనీకి సంబంధించిన ఆర్థిక సమస్య పరిష్కారం కోసం సర్క్యులర్


The New Life Circulars

By

Meher Baba and His Mandali

An Avatar Meher Baba Perpetual Public
Charitable Trust eBook
April 2013

© 2013 Avatar Meher Baba Perpetual Public
Charitable Trust. All rights reserved.

నంబర్లు 6 16 లలో "ఓల్డ్ లైఫ్ బోజా ఫండ్" వంటి ఆర్థిక లావాదేవీల వివరాలు ఉన్నాయి. అలాగే, బాబా, ఆయన సహచరుల దైనందిన కార్యకలాపాల వివరాలను కూడా ఈ సర్క్యులర్ల ద్వారా తెలియజేశారు. ఈ సర్క్యులర్లు తొలుతగా బాబా అనుచరుల కోసం పరిమిత సంఖ్యలో విడుదల చేశారు. ఐతే, 1967లో హైదరాబాద్‌లోని మెహెర్ విహార్ ట్రస్ట్ తరఫున స్వామి సత్య ప్రకాష్ ఉదాసీన్, (స్వామీజీ) సంపాదకత్వంలో ఈ సర్క్యులర్ అన్నింటినీ గుదిగుచ్చి ఒక చక్కని పుస్తకంగా ప్రచురించారు. ఈ పుస్తకానికి

**The New Life of Avatar Meher Baba and His Companions:**
**A Compilation of All the 34 New Life Circulars**

**అని పేరు పెట్టారు. ఐతే, నేడు ఈ పుస్తక ప్రతులు అలభ్యం. స్వామీజీ సమకాలీనుల దగ్గర** ఒకరిద్దరి దగ్గర ఈ పుస్తక ప్రతులు వుండి వుండొచ్చన్నది కొందరి అభిప్రాయం.

**కాగా, బాబా ట్రస్టు అరుదైన నవజీవనం సర్క్యులర్‌లన్నింటినీ డిజిటల్ ఎడిషన్ ద్వారా** పాఠకులకు అందుబాటులో తీసుకువచ్చారు. నేడు ఈ జీవిత సర్క్యులర్‌లు ఇంటర్‌నెట్‌లో ఇ-బుక్‌లలో లభిస్తున్నాయి. ప్రేమిక పాఠక లోకానికి ఈ డిజిటల్ సర్క్యులర్ ప్రతులు ఒక అమూల్య సమాచార భండాగారం. పాఠకులు నెట్‌లో తక్షణం బ్రౌజ్ చేయగలరు.

***

# క్రొత్త వెబ్ సైట్

## www.Srimeherbabatelugu.org

**మెహెర్‌బాబా పత్రికకు నూతన వెబ్‌సైట్‌ని రూపొందించడమైంది. 2026 మే నాటికి పత్రిక ప్రారంభించి 25 సంవత్సరాలు నిండాయి. ఇంతకాలంగా ప్రచురించిన మెహెర్‌బాబా మాస పత్రికలను ఈ వెబ్‌సైట్ ద్వారా ఆసక్తిగల పాఠకులకు అందుబాటులో వుంచాలన్నది మా ప్రయత్నం. మీ సలహాలు, సూచలను మేం ఎల్లవేళలా స్వాగతిస్తాం.**

# మెహెర్‌బాబా - నవజీవనం

**మెహెరీశంలో అత్యంత ప్రధాన ఘట్టం నవజీవనం. 1949 అక్టోబరు 16 నుండి 1952** ఫిబ్రవరి 12 వరకు మెహెర్‌బాబా నవజీవనం గడిపారు. అత్యంత కష్టతరమైన నవజీవన సమయానికి మెహెర్‌బాబా వయస్సు సరిగ్గా 55 1/2 సంవత్సరాలు వుంది. మెహెర్‌బాబాతో పాటు మొత్తం 20 మంది నవజీవనంలో పాల్గొన్నారు. అందులో నలుగురు స్త్రీలు, 16 మంది పురుషులు వున్నారు. పాల్గొన్న నలుగురు స్త్రీలలో మెహెరామాయి వయస్సు 42, బాబావారి సోదరి మణి 31, మెహ్రూ 22, డాక్టర్ గోహెర్ (34) సంవత్సరాలు. కాగా, పురుషులలో అందరికంటే వయస్సులో పెద్దవాళ్ళు సదాశివ పటేల్, అన్నా 104. వీరద్దరూ అప్పటికే 60 సంవత్సరాల వయస్సులో వున్నారు. అలాగే, వయస్సురీత్యా పెద్దవారు - దౌలత్ సింగ్ (59), గుస్తాద్‌జీ (59), కాకా బారియా (58), బైదుల్ (56) వున్నారు. అందరికన్నా వయస్సులో చిన్నవారిగా ఏరుచ్ (33), మురళి కాలే (30) వున్నారు. మిగిలిన వారందరి వయస్సు 40-50 నడుమ వుంది.

## ప్రయోజనం ఏమీ లేదు

**తనతో నవజీవనంలో పాల్గొనడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఆశించవద్దన్నారు బాబా. ఈ** కార్యక్రమంలో పాల్గొనడం వల్ల బాబావారి నజర్ తమపై వుంటుందని, ఐహికంగా, ఆధ్యాత్మికంగా ఎనలేని ప్రయోజనం వాటిల్లుతుందనే ఆశపెట్టుకోవద్దన్నారు. సరికదా, ఈ జీవనవిధానంలో ఎన్నో బాధలు, కష్టాలు అనుభవించవల్సి వుంటుందని హెచ్చరించారు. అందుకు సిద్ధపడినవారే తనతో నవజీవంలో పాల్గొనమని బాబా తన మండలిని ఆహ్వానించారు. ఈ జీవన విధానంలో బాబా ఒకచోట నుండి మరొకచోటకు కాలినడకన, ఎద్దుల బండ్లపై అనేక విధాల ప్రయాణిస్తారు. బాబా ఎక్కడకెళ్ళినా, ఎక్కడవుంటే అక్కడ బాబాతో వుండటానికి ఇష్టపడినవారే నవజీవనంలో పాల్గొనాలనీ అన్నారు. నవజీవనంలో పాల్గొనగోరువారు బాబా వారు విధించిన నియమావళిని తు.చ తప్పక పాటించాలని ఆదేశించారు. అవతారుడు ఇచ్చిన నియమావళి ఇలా వుంది.

**1. స్త్రీలను తాకరాదు. డబ్బు ముట్టరాదు. ఎవరి దగ్గర్నుండి డబ్బు తీసుకోరాదు. ఇవ్వకూడదు.** రాజకీయ విషయాలు ముచ్చటించరాదు. మీ నడవడికలో ఎన్నడూ ఎవ్వరిపై కోపం ప్రదర్శించ కూడదు. బాబా వారి ముందస్తు అనుమతి లేకుండా ఎవరూ ఎక్కడికీ వెళ్ళకూడదు. మంచినీళ్ళు తప్పించి, బాబా వారి అనుమతి లేకుండా ఎవరూ ఏమి తినకూడదు, త్రాగ కూడదు. అసత్యం మాట్లాడరాదు.

## భిక్షాటనతో

ఈ నవజీవనంలో బాబా ఆయన సహచరులు బాటసారులలాగా బిక్షాటన చేస్తూ రేపటి గురించి ఆలోచన లేకుండా, దేనినీ ఆశించకుండా, ఏ సహాయం ఆర్థించకుండా జీవితం గడిపారు. చెట్ల కింద, ఆకాశం కింద తల దాచుకున్నారు. నవజీవనంలో గురువు లేడు. శిష్యుడు లేడు. అందరూ భగవంతుని ప్రేమికులే. అందరూ సమానులే. ఐతే గత అవతార కాలంలో ఈ మాదిరి అవతారుడు నవజీవనం నెరపినట్లు దాఖలాలు ఎక్కడా లేవు.

## ఖాజాగూడాలో మనోనాశ్

**నవజీవనంలో ఆఖరి ఘట్టంగా బాబా మనోనాశ్ కార్యక్రమాన్ని 1951 అక్టోబరు 16 నుండి 23 వరకూ** హైదరాబాద్‌లోని ఖాజాగూడాలో వున్న ఒక చిన్న ఎత్తైన కొండ గుహలో నిర్వహించారు. మనోనాశ్ అంటే మనస్సుని నశింపజేయడం. మనస్సు రాతి యుగం కన్నా పురాతనమైందన్నారు బాబా. మనస్సు ఒకసారే జన్మిస్తుంది. దాని మరణం కూడా ఒకసారే జరుగుతుంది. మనస్సు మరణించాకనే అబద్ధపు నేను స్థానంలో నిజమైన నేను ఏర్పడుతుంది. మనస్సు వల్లనే మానవాళి “నేను నాది” అనే భావాలు కలిగి వున్నారు. మానవుడు మరణించాక కూడా మనస్సుకు మరణం లేదు. పునరపి మరణం–పునరపి జననంతో సంస్కారాల ప్రభావం వల్ల మనస్సు మానవుడ్ని వెన్నంటే వుంటుంది అని బాబా ప్రవచించారు. మనస్సు తన స్వభావం నుండి తప్పించి, భగవంతుడొక్కడే సత్యము అనే ఎరుక వల్ల మనోనాశ్ జరుగుతుందని బాబా అన్నారు. మనోనాశ్ కార్యక్రమాన్ని నవజీవనానికి ఆఖరి ఘట్టంగా బాబా ఈ కార్యక్రమం నిర్వహించారు.

**ఆ పిదప, 1951 అక్టోబరు 24న కాలినడకన హైదరాబాద్ నుండి మెహెరాజాద్‌కు బయల్దేరారు.** ఈ నవజీవనం ఎవరూ లేకపోయినా దానంతటదే జీవిస్తుందన్నారు. నవజీవనం అంతులేనిది. బాబా వారు శరీరం చాలించిన తర్వాత కూడా ఎవరైతే అసత్యం, ద్వేషం, క్రోధం, కామం పూర్తిగా విడిచి, ఎవరికీ, దేనికీ భయపడకుండా సత్యాన్ని విడువక జీవితాన్ని గుడుపుతారో అలాంటివారు ఈ నవజీవనాన్ని సజీవంగా నిలుపుతారని బాబా ప్రవచించారు. ఈ నవజీవనాన్ని గడపడానికి ఎవరూ లేకపోయినా అది శాశ్వతంగా నిలుస్తుందని బాబా అన్నారు.

**అవతారుడు మనోనాశ్ కార్యక్రమం చేపట్టి 2026 అక్టోబరు నాటికి 75 సంవత్సరాలు నిండుతున్నాయి. ఈ సందర్భంగా, హైదరాబాద్‌లో రెండు రోజుల మనోనాశ్ అమృతోత్సవ వేడుకలు 2026 అక్టోబరు 17న జూబ్లీ బాబా కేంద్రంలో, అక్టోబరు 18న మనోనాశ్ గుహ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. అందరూ ఆహ్వానితులే!** *

## శ్రీ ముప్పాళ్ళ సమక్షంలో జరిగిన వాస్తవ సంఘటన

# శంకుస్థాపన కోసం రాయి




**ఆయన పేరు శ్రీ యం.కె. విశ్వనాథం. ఆయన గుంటూరు మునిసిపాలిటీలో టౌన్** ప్లానింగ్ అధికారిగా పనిచేశాడు. ఆయన గుంటూరులో కట్టుకోబోయే ఇంటి శంకుస్థాపనకు 1972లో అమరతిథికి హాజరై, మెహెరాబాద్ నుండి ఒక రాయిని శంకుస్థాపన కోసం తీసుకెళ్ళాలను కున్నాడు. ఆ ఏట అమరతిథికి విశ్వనాథం గారి స్నేహితులు శ్రీ ముప్పాళ్ళ రాధాకృష్ణమూర్తి కుటుంబసభ్యులతో కలిసి హాజరయ్యారు. శ్రీ ముప్పాళ్ళ నేడు మెహెరాబాద్‌లో స్థిరపడ్డారు.

ఐతే, శ్రీ విశ్వనాథం మెహెరాబాద్ నుండి తాను కోరిన రాయి తీసుకెళ్ళడం సాధ్యమయినా? ఆనాడు అసలేం జరిగింది, ఇత్యాది విషయాలు ఈ శీర్షికలో ఆసాంతం చదవండి. మెహెరీశంలో కానరాని ఈ వాస్తవ సంఘటనకు శ్రీ ఏ. జనార్ధన్ రావ్, నిజామాబాద్ కూడా ప్రత్యక్ష సాక్ష్యం అని ఆయన మాతో ఫోన్‌లో చెప్పారు. తరాలు మారుతున్న వేళ, ఈ కథనం గురించి క్లుప్తంగా విశ్వనాథం గారి మాటల్లో చదువుకుందాం!

**“నా పేరు యం కె విశ్వనాథం. నేను 1971వ సంవత్సరంలో గుంటూరులో ఇల్లు కట్టుకోవాలనుకున్నాను.** ఇంటి నిర్మాణానికి అవసరమైన అన్ని మునిసిపాలిటి అనుమతులు సిద్ధం చేసుకున్నాను. అది అక్టోబరు మాసం. మంచి ముహూర్తాలు వున్నాయని మిత్రులు తొందర పెట్టారు. కానీ, నేను 1972 జనవరి 31న మెహెరాబాద్‌లో జరిగే అమరతిథికి వెళ్ళి, అవతారుని పాదస్పర్శతో పునీతమైన ఒక చిన్న రాయిని తీసుకొచ్చి దాన్ని ముందుగా శంకుస్థాపనలో వుపయోగించాలన్నది నా కోరిక. అందుకోసం, అమరతిథి తర్వాతనే శంకుస్థాపన తేదీ వుండాలని నిర్ణయించుకున్నాం.

**అవతారుని 4వ అమరతిథికి మాతోపాటు శ్రీ ముప్పాళ్ళ రాధాకృష్ణమూర్తి, ఆయన భార్య కూడా** వచ్చారు. జనవరి 31న బాబా నామస్మరణతో గడిచింది. ఆ మర్నాడు అంటే మా తిరుగు ప్రయాణం. ఆ రోజున మరోమారు బాబాని దర్శించుకుందామని

ఎగువ మెహెరాబాద్‌కి వెళ్ళాం. అక్కడ బాబా వారి సోదరి మణిజా, మెహెరా మాయి, ఏరుచ్ తదితరులు బాబా ప్రేమికులతో అనేక బాబా విషయాలు ముచ్చటిస్తుంటే మేం కూడా అలా ఆలకిస్తూ కూర్చున్నాం. కొద్దిసేపటి తర్వాత, మెహెరాబాద్ కొండపై నుండి శంకుస్థాపన కోసం ఒక రాయిని తీసుకెళ్ళాలన్న సంగతి గుర్తుకు వచ్చింది. వంగి ఒక రాయిని తీసుకోబోయి, క్షణకాలం ఆలోచనలో పడ్డాను. బాబా వారి రక్తం పంచుకుని పుట్టిన మణిజా చేతులు మీదుగా ఆ రాయిని అందుకుంటే, ఆ గులకకు మరింత పవిత్రత చేకూరుతుంది కదా అనుకున్నాను. ఆ వెనువెంటనే, నా మనస్సులోని మాటను మణిజాకు చెప్పాను. నేను ఆమెను అలా అడగ్గానే, మణమ్మ మాకేసి తేరిపార చూసింది. ఒక్క క్షణం స్థాణువుగా నిల్చింది. అదే సమయంలో, ఆనందం, ఆశ్చర్యం, అతిశయం, ఇలా అనేక విషయాలు ఆమె ముఖంలో కనిపించాయి. నాకు భయం వేసింది. తప్పు చేశానన్న శంక నాలో మెదిలింది. ఆమెకు కోపం వచ్చిందా? అనే సంశయం కలిగింది. వెంటనే అమ్మా! తప్పయింది. క్షమించమన్నాను. ఆ మాటలకు ఆమె తేరుకుని, నా చేతులు పట్టుకుని, నాకేసి ప్రేమగా చూసింది. నీవు అడిగిన నీ కోరిక నన్ను ఆశ్చర్యంలో పడేసింది అన్నది. ప్రేమగా మా కుటుంబసభ్యులకి ఆలింగనం ఇచ్చింది. ఇంకా ఆమె ఇలా అన్నది.

**ఈరోజు నాకు చాలా ఆనందంగా వుంది. మీరందరూ చాలా అదృష్టవంతులు. గతావ** తారాలలో ఎన్నడూ ఈ మాదిరి జరగలేదు. స్వయంగా అవతారుడే మీ ఇంటికి శంకుస్థాపన చేశాడు. ఆహా! అదృష్టం అంటే మీదే. ఇది మీ పూర్వజన్మ పుణ్యఫలం. ఈ జన్మలో బాబావారి ప్రేమను, ఆశీస్సులు పొందగల్గిన ధన్యులు మీరు అన్నది. ఆనంద పారవశ్యంతో ఆమె మాట్లాడుతుంటే, నాకేమీ అర్థం కాలేదు. **ఆమె ఇంకా ఇలా అన్నారు. 'సుమారు 5 సంవత్సరాల క్రితమే, బాబా నా చేతికి ఒక చిన్న** రాయిని ఇచ్చారు. ఇది ఇంటి శంకుస్థాపన కోసం అని నన్ను హెచ్చరించారు. నా ప్రేమికుడొకరు శంకుస్థాపన కోసమని ఒక రాయిని నిన్ను అడుగుతాడు. అప్పుడు ఈ రాయిని అతనికి ఇవ్వమని, బాబా నా చేతిలో పెట్టారు. ఐతే, ఆ ప్రేమికుడ్ని నేనెలా గుర్తుపట్టాలి? అని బాబాని అమాయ కంగా అడిగితే, అతనే నిన్ను వెదుకుతూ వస్తాడని, చిరునవ్వులు చిందించారు. **ఆనాటి నుండి ఈ రాయి నా దగ్గర మెహెరాజాద్‌లో బద్రంగా దాచిపెట్టాను. లేదంటే, నేను** స్వయంగా మీ గుంటూరుకి రావల్సి వస్తుందన్నది నవ్వుతూ. ఆ తర్వాత, మెహెరాజాద్‌కి ఆమె బయల్దేరారు. మేం కూడా ఆటోలో ఆమెను అనుసరించాం. బాబావారిచ్చిన రాయిని కాగితంలో బద్రంగా చుట్టి వుంచిందామె. ఆ రాయిని నాచేతికి ఇస్తూ, ప్రతిరోజూ ఎందరో ప్రేమికులు అనేక కోరికలతో ఉత్తరాలు వ్రాస్తుంటారు. శంకుస్థాపన కోసం ఒక రాయి కావాలని ఎవరు అడుగుతారా? అని గత ఐదేళ్ళ నుండి నేను ఎదురు చూస్తున్నాను. ఈ రోజుకి సమాధానం దొరికింది. మీరు చాలా అదృష్టవంతులు"

బాబా సర్వజ్ఞుడే కాదు. ప్రేమ మహా సాగరుడు. తన ప్రేమికుల చిన్ని కోరికలు కూడా విస్మరించడు సుమీ అన్నది. సుమారు 5 సంవత్సరాల క్రితమే అంటే నేను ఇంటిస్థలం కొనక పూర్వమే బాబా నన్ను అనుగ్రహించాడనిపించింది. రామావతారంలో పేద శబరి మనస్సు ఎరిగి శ్రీరాముడు ఆమె దగ్గరకి వెళ్లి ఆమెని సంతోషపరిచాడని ఒక కథగా విన్నాం. ఐతే, ఈ అవతార కాలంలో నేను సాక్షాత్తూ దేవదేవుని ప్రేమను ప్రత్యక్షంగా అనుభవించాను.

## పూర్వాపరాలు

శ్రీమతి లతా విషఢ్ఞరావు, కాకినాడ గారి రచన 'హృదయ స్పందన' పుస్తకంలో అనే పుస్తకంలో ఈ సంఘటన గురించి వివరంగా తెలియజేశారు. కాగా, 2026 జూలై 29న కోఠి మెహెర్ సెంటర్ 51వ వార్షికోత్సవం సందర్భంగా ఈ అంశాన్ని నాటీకరణ చేసి శ్రీ మలకపల్లి నర్సి దర్శకత్వంలో ప్రదర్శించారు. విజయవాడ కేంద్ర పూర్వ కార్యదర్శి శ్రీ నందిగామ శర్మ ఈ శీర్షికను ప్రచురణార్థం అందజేశారు.

**మెహెరీశంలో కానరాని ఇలాంటి వాస్తవ సంఘటనలు ఎన్నో కదా!**

## కోల్‌గావ్‌లో తేనీటి విందు:

మెహెరాజాద్‌లో అవతారుడు 1948, ఆగస్టు 27 నూతన గృహప్రవేశం చేశారు. ఆ మర్నాడు సాయంత్రం మెహెరాజాద్ నుంచి సుమారు 40 కిమీ దూరంలో వున్న కోల్‌గావ్ గ్రామంలో బాబా తన మండలికి తేనీటి విందు ఇచ్చారు. ఈ పూర్తి కథనం ప్రక్క పేజీలో చదవుకుందాం!



# మెహెరాజాద్ గృహప్రవేశం

## 'ఆజాద్' అంటే స్వేచ్ఛ, ప్రశాంతత, అనే అర్థాన్ని స్ఫురింపజేస్తుంది

**1948, ఆగస్టు 27 శుక్రవారం. ఉదయం 9 గంటలు.**

ఆనాడు మెహెరాజాద్ నూతన గృహప్రవేశ మహోత్సవం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. ముంబాయి, పూణే, అహమ్మద్‌నగర్ తదితర ప్రాంతాల నుండి బాబా ప్రేమికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శ్రీయుతులు రోడా, జిమ్మీ మిస్త్రీ దంపతులు, నారిమన్, అర్నవాజ్ దంపతులు, డాక్టర్ దేశ్‌ముఖ్, ఆయన భార్య ఇందుమతి మెహెరాబాద్‌లో నివసిస్తున్న స్త్రీ, పురుష, మండలి ప్రేమికులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

## తలుపులు తెరిచిన బాబా:

**ముందుగా అవతారుడు స్వయంగా వెండి తాళంచెవితో నూతన భవనం తలుపులు తెరిచారు.** అనంతరం, మెహెరా, గుల్మాయిలు బాబాకు మంగళ హారతులు ఇచ్చారు. ఈ నివాస ప్రాంగణానికి 'మెహెరాజాద్' అని బాబా వారు నామకరణం చేశారు. **'ఆజాద్'** అంటే స్వేచ్ఛ, ప్రశాంతత, అనే అర్థాన్ని స్ఫురింపజేస్తుంది. ఈ సందర్భంగా బాబా వారిచ్చిన ప్రత్యేక సందేశాన్ని ఆది సీనియర్ చదివి వినిపించాడు. బాబా సందేశం ఇలా వుంది. **'మెహెరాజాద్ చరిత్రలో సరోష్ పాత్ర ఎంతో విశిష్టమైనది. ప్రారంభంలో ఈ నిర్మాణానికి** సరోష్ పూర్తి ఆర్థిక సహాయం అందించాడు. ప్రస్తుత భవన నిర్మాణానికి బాబా రూ. 20,008/– చెల్లించగా, ఆది జూనియర్ రూ. 15,000/– విలువైన కలప అందించాడు. మిగిలిన మొత్తాన్ని సరోష్ సమకూర్చాడు. మెహెరాజాద్‌లో గృహనిర్మాణ పనులలో మహబూబ్, పాద్రీ ఇంజనీరింగ్ పనులలో కీలకపాత్ర పోషించారు. **వచ్చే సెప్టెంబర్ 15 నాటికి మెహెరాజాద్‌కు మారాలని నిర్ణయించామన్నారు బాబా.** అప్పటికల్లా మహబూబ్ బృందం ఇక్కడ అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తుందని ఆశిస్తున్నాను. ఈ రోజు ప్రారంభోత్సవ కార్యక్రమానికి కాకా, రూసీ (పాప్) ఎంతగానో శ్రమించారు. ప్రతి చిన్న విషయాన్ని శ్రద్ధగా పర్యవేక్షించారు. మీ అందరికీ ఆశీస్సులు అందజేస్తున్నా అన్నారు. ఈ ప్రపంచానికి నా ఆశీస్సులు ఎంతో అవసరం కానున్నాయి త్వరలో" అన్నారు. ఈ భవన నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన సరోష్, మహబూబ్‌లను బాబా పూలమాల లతో సత్కరించారు. ఈ సందర్భంగా, కాకా బారియా చేసిన సంక్షిప్త ఆంగ్ల ప్రసంగం అందర్నీ ఆకట్టుకుంది. విచ్చేసిన ప్రేమికులందరికీ అల్పాహారం అందజేశారు. ఆ పిదప, మధ్యాహ్నం ఒంటి గంటకు అందరూ తమ స్వస్థలాలకు తిరుగు ప్రయాణమయ్యారు.



# మెహెరీశం

**అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర**
**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ**
**లార్డ్ మెహెర్, 1925 నుండి**
**తెలుగుసేత: మల్లాది రామారావ్, మెహెరాబాద్**

**(గత సంచిక తరువాయి)**

**సామూహిక ఉద్యమాలకైనా, మత ప్రచారానికైనా ముందుండి నడిపించే వ్యక్తి అవసరం.**
కేంద్రీకృత శక్తి లేకపోతే ఉద్యమాలన్నీ వీగి పోతాయి.
సద్గురువులు ఆధ్యాత్మిక సుసంపన్నులు.
వారి ప్రభావం అంతా యింతా కాదు.
తమని దర్శించిన వారి ద్వారా ఆధ్యాత్మికతకి కొత్త వూపిరి పోస్తారు సద్గురువు.
వివిధ దేశాలు లాభపడతాయి ఇందువల్ల.
నేను తీసుకువచ్చే ఆధ్యాత్మిక విస్ఫోటనం వల్ల అందరూ లాభపడతారు.
ఎంతమేరకు అంటే, వారి శక్తిని బట్టి వుంటుంది ఎంతగా లాభపడేది.
**ఇంకోమాట.**
ఈ రాబోతున్న మార్పులన్నీ సర్వోన్నతమైన నా యిచ్ఛ ఫలితమే.
ఎవరి ఆదేశాలనీ తీసుకోను నేను.
ప్రతీదీ నా యిచ్ఛ ప్రకారమే జరుగుతుంది.
ఏ సంగీతం నాకు తెలియకుండా వుండదు.
నేను అన్నింటిలో వున్నాను. సమయం, స్థలం అన్నవి లేవు నాకు.
వాటి ఉనికికి కారణం నేనే.
నువ్వు వున్నావనుకో. నీకేమి కనిపిస్తుంది.
కళ్ళముందు జరుగుతున్నవి కనిపిస్తాయి.
అవునా, అంటే నీకు సంబంధించిన ప్రాపంచిక విషయాలని నువ్వు చూస్తున్నావు.
నీలాగే నేను చూస్తాను. కళ్ళముందున్న విషయాలనే కాదు,
గతాన్ని భవిష్యత్‌నీ స్పష్టంగా, ప్రస్ఫుటంగా చూస్తాను నేను".
**బాబావారి సుదీర్ఘమైన జవాబుని రోమూ లాండో శ్రద్ధగా చదివాడు.**
**ప్రభావితుడయ్యాడు.**

ఇందుకు ప్రబల నిదర్శనం అతని పుస్తకం “నా సాహసం భగవంతుడే”
**(God is my Adventure)**, అన్న పేరుతో వెలవడిన ఈ పుస్తకంలో
బాబా వారితో పరిచయం, తన ప్రశ్నలు, ప్రభువు సమాధానాలన్నీ పొందుపరిచాడు.
ఈ పుస్తకానికి ఉపశీర్షిక – సద్గురువు మెహెర్‌బాబా చరిత్ర.
ఈ పుస్తకం విరివిగా అమ్ముడు పోయింది.
గమ్మత్తు ఏమంటే మెహెరీశుని దర్శించిన వెంటనే వ్రాయలేదీ పుస్తకాన్ని రోమ్ లాండో.
ప్రభువుని దర్శించిన మూడేళ్ళకి ప్రచురించాడు.
అప్పటికి నోరీనాని కలిశాడు న్యూయార్కులో. ఆమె కథనాన్ని కూడా పుస్తకంలో జేర్చాడు.
నోరీనాతో పరిచయం క్వెంటిన్ పుణ్యం.
లాండోని చూస్తూనే మేధావిలా వున్నాడనుకొంది నోరినా.
భగవదన్వేషి, దైవ చింతన ఎక్కువే యితగాడిలో అనిపించింది.
అందుకనే బాబావారిని దర్శించడానికి ముందు,
దర్శించిన తర్వాత కలిగిన అనుభవాలని పూసగ్రుచ్చినట్లు చెప్పింది లాండోకి.
ఇలా చెప్పి, తప్పు చేశాను అని తలపట్టుకొంది దరిమిలా.
ఎందుకంటే, లాండో మాటలు, చేతలు చూస్తుంటే, మెహెరుని నమ్మిన దాఖలా
కనిపించ లేదు. పైపెచ్చు బాబావారంటే సందేహాలు వున్నట్లున్నాయి అతనిలో.
మరి ఎందుకమ్మా మనసు విప్పి మరీ మాట్లాడావు లాండోతో అని అంటే,
నోరినా ఏమన్నదో తెలుసా పాఠక మహాశయా?
క్వెంటన్ పరిచయం చేశాడు రోమా లాండోని. క్వెంటన్ మిత్రుడు కాబట్టి, మనవాడే అనుకొన్నాను. నా అనుభూతులన్నీ చెప్పాను.

**నోరినా కథనంలో నీతి – కొత్తవారెవరు అయినా, మిత్రులే వాళ్ళని పరిచయం చేసినా, ఆచి తూచి మాట్లాడటం శ్రేయస్కరం, సర్వదా!**

**నోరినా – లాండో కథలో కొసమెరుపు. లాండో పుస్తకం పుణ్యమా అని బాబా వారి నామం** మరింత మందికి తెలిసింది. ఇతను ఇంకో పుస్తకం కూడా వ్రాశాడు. పుస్తకం పేరు ఆధ్యాత్మిక సంపన్నులు, గురువులు, బోధకులు. ఇది పది పన్నెండు ముద్రణలకి నోచుకొంది. దరిమిలా కాలంలో లాండో రూటు మార్చాడు. కాలిఫోర్నియాలో ఆచార్యుడయ్యాడు. ఇస్లామ్ మతం గురించి పాఠాలు చెప్పాడు 1974లో కన్ను మూసేవరకూ.

**అలనాటి కల్నల్ ఇరానీలాగా, ఇలనాటి మెరిడిత్ స్టార్‌లాగా, ప్రొఫెసర్ లాండో గారు కూడా** తమదైన శైలిలో మెహెర్ నామ ప్రచారం చేశారు. **మే 11వ తేదీ బుధవారంనాడు బాబావారిని లబ్ధప్రతిష్టుడైన వో రచయిత దర్శించాడు.** బ్రిటీషు సేనల వ్యూహకర్తగా

కూడా పేరు మోశాడాయన. ఆయన పేరు మేజర్ జనరల్ జె.ఎ.ఎఫ్.సి. ఫుల్లర్. ఉభయకుశలోపరి తర్వాత మనసులో మాట బయటపెట్టాడు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై మీ అభిప్రాయం చెప్పమని అడిగాడు. పశ్చిమ దేశాల్లో వున్న స్థితిగతులు, భారతదేశంలో ప్రజా ఉద్యమాల గురించి ఏమంటారు మీరు అని సూటిగానే ప్రశ్నించాడు. బాబా వారు అమెరికా వెళ్ళే హడావుడిలో వున్న సంగతి తెలుసు. **అందుకనే మరో ప్రశ్న అడిగాడు. అక్కడ అమెరికాలో మీ సెంటరు పెట్టాలనుకొంటున్నా రుట.** నిజమేనా బాబా! ఈ ఆలోచన ఎందుకు వచ్చింది అని అడిగాడు.

**బాబా వారు చిరునవ్వు నవ్వారు. అక్కడ అమెరికాలో గొప్ప శక్తి వుంది. వరదలా ప్రవహి** స్తోంది ఆ శక్తి. తప్పుదారి పడుతోంది. అందుకనే వెడుతున్నా అమెరికాకి అన్నారు. ఫుల్లర్ గారు లబ్ధప్రతిష్ఠుడని చెప్పుకొన్నాము కదా! ఈయనకి ఆధ్యాత్మిక విషయాలపైన కూడా ఆసక్తి ఎక్కువే. మన మెరిడిత్ స్టార్‌కి ఉత్తరాలు వ్రాసేవాడు మనసులో మాట చెప్తూ. 1878లో పుట్టిన ఈ పెద్దమనిషి 1960లో కన్నుమూశాడు. సైనిక వ్యూహకర్తగా ఎంత పేరు సంపాదించాడు అంటే, ఫుల్లర్ వంటి వ్యక్తులు అరుదు అన్న ముద్ర పడింది. మొదటి ప్రపంచ యుద్ధంలో బ్రిటీషు సేనల టాంకు దళాన్ని తయారుచేశాడు. టాంకు యుద్ధ వ్యూహ రచన చేశాడు. ఫుల్లర్ గారి మెలుకవల్ని నాజీ సేనలు పాటించి రచ్చ రచ్చ చేశాయి. రెండో ప్రపంచ యుద్ధంలో ఇదీ ఫుల్లర్ గారి ప్రవర.

**ఒకరోజున మెరిడిత్ తల్లి బాబా వారిని ఆహ్వానించింది. మా యింటికి రండి ప్రభూ, మా** ఆతిథ్యం స్వీకరించండి అని అభ్యర్థించింది. ఆమె నివాసం లండన్‌లోనే హాంప్ స్టెడ్ అనే ప్రాంతంలో వుంది. బాబా వారు ఆమె యింటికి వెళ్ళారు. ఆ తల్లి ఆతిథ్యం స్వీకరించారు. ఆశీర్వదించారామెని. తమ బసకి తిరిగి వస్తూ మార్గరెట్, మాబెల్‌ల నృత్య కేంద్రాన్ని సందర్శించారు. ఆ సమయంలో వో పదిమంది పిల్లలు నృత్యాభ్యాసం చేస్తున్నారు. వాళ్ళకి తమ ఆశీస్సుల్ని ఇచ్చాడు మెహెరీశుడు.

**మే 11వ తేదీ రాత్రి బాబా వారు, శిష్యులు ఒలింపియా ప్రదర్శనశాలకి వెళ్ళారు. అక్కడ** సంగీత కచేరీలు జరుగుతూ వుంటాయి. నాటకాలు ప్రదర్శిస్తూ వుంటారు. అడపాదడపా సర్కస్‌లు కూడా వస్తాయి అక్కడికి. సుమారు ఇరవై ఏళ్ళ క్రిందట ఒలింపియాలో 'మహత్యం' అన్న పెద్ద నాటకం ప్రదర్శించారు. నోరీనా ముఖ్య పాత్ర వహించిందా నాటకంలో. మరి బాబా వారు ఒలింపియాకి వెళ్ళినప్పుడు జరుగుతున్న ప్రదర్శనల వివరాలు చరిత్రకారుడు ప్రస్తావించ లేదు. అంటే బాబా వారు అక్కడ అంటే ఏమి చూశారు, ఎవరెవర్ని కలిశారో తెలిదు. గతంలో ఎప్పుడో నోరినా వేసిన నాటకానికి, ఇప్పటి బాబా వారి రాకకీ ఏదైన సంబంధం వుందేమో? ఎవరికి తెలుసు ఇది ఊహాగానమే

**ననుకోండి. నేషనల్ గాలరీకి, జంతు ప్రదర్శనశాలకీ కూడా బాబా వారు వెళ్ళి వచ్చారు వో రోజున.** పెద్ద ఆదీ ఇంటి దారిపట్టాడు మే 13 సాయంత్రం. "మూల్టన్" అన్న నౌక ఎక్కాడు. మూడు రోజుల్లో నాసిక్ చేరాడు. సర్కిల్ సినిమా వ్యవహారాల్ని తన చేతిలోకి తీసుకొన్నాడు. ఇంతకాలం సినిమా హాలు వ్యవహారాలు బువా సాహెబ్ చూస్తున్నాడు. ప్రస్తుతం శలవపై వెళ్ళాడు.

**మే 12న చట్టసభ (పార్లమెంటు)కి వెడదామన్నారు అందరూ. సరే కదలండి అన్నారు** బాబా ఇష్టం లేకపోయినా, వీరందరూ వెళ్ళేసరికి పార్లమెంటు సమావేశాలు నడుస్తున్నాయి. సభ తీరు తెన్నులు గమనించి వస్తుంటే మీ అభిప్రాయం వ్రాయండి బాబా సందర్శకుల రిజిస్టరులో అన్నారు. వాళ్ళ అభ్యర్ధనని త్రోసిపుచ్చలేదు.
ఇంతకీ బాబా వారు ఏమి వ్రాశారో వూహించ గలరా పాఠక మహాశయా,
"ఇటువంటి ప్రభుత్వ భవనానికి ఎప్పుడూ రాలేదు.
ఇదే తొలిసారి సందర్శకుల రిజిస్టరులో నా మాట వ్రాయడం,
సంతకం పెట్టడం ఇదే ప్రథమం" అని వ్రాశారు.
ఈ సందర్శకుల రిజిస్టరు ఎంతో విలువైనది.
సాక్షాత్తూ అవతారుడే స్వహస్తాలతో వ్రాసిన పుస్తకం.
ఎంత వెతికినా దొరకలేదు ఇప్పుడు.
పార్లమెంటులో లేదు ఈ రిజిష్టరు.
బహుశా పార్లమెంటుకు దగ్గరగా వున్న భవనంలో భద్రపరిచి వుండవచ్చు.
పార్లమెంటుకి దగ్గర వున్న బిల్డింగ్‌లపై బాంబులు పడ్డాయి రెండో ప్రపంచ యుద్ధంలో.
అలా మనకి అందకుండా పోయింది వో చారిత్రక సాక్ష్యం.

**భారతదేశానికి తిరిగి రావటానికి గాను వీసా కావాలి బాబా వారికి. బ్రిటీషు విదేశీ** వ్యవహారాల ఆఫీసుకి మే 13న వెళ్ళారు. ఇండియా వీసా కోసం దరఖాస్తు చేశారు.
ఆ సాయంత్రం బాబా వారికి "వీడ్కోలు విందు" యిచ్చారు స్థానిక ప్రేమికులు.
ఆంగ్లో–సిలోన్ రెస్టారెంట్‌లో ఏర్పాటు చేశారు విందు.
మే 12వ తేదీ శనివారం ఉదయాన్నే బాబా వారు అమెరికాకి బయలుదేరారు.
వెంట క్వింటన్, చిన్న ఆదీ, బెహరం, ఛాన్జీ, కాకా, ఘనీ కదిలారు.
మీతో మేమూ అంటూ మెరిడిత్ దంపతులు వచ్చారు.
వీరిందరికి కన్నీటి వీడ్కోలు చెప్పారు స్థానిక బాబా ప్రేమికులు.

**– సశేషం**

# నివాళి ఆ బస్సులో నేనూ వున్నాను

మల్లాది రామారావ్, మెహెరాబాద్



**1969లోనే నా బి.ఎస్సీ డిగ్రీ** పూర్తయింది. ఆ రోజుల్లో మేం నరసరావుపేటలో వుండేవాళ్ళం. స్థానికంగా ఓ ప్రైవేట్ ట్యుటోరియల్ కాలేజీలో లెఖ్ఖల మాస్టారుగా చేరాను. అంతక్రితం కొంతమంది స్నేహితులతో కలిసి మెహెర్‌బాబా మొబైల్ యూనిట్ పేరిట ఒక స్వచ్ఛంద సంస్థను ప్రారంభించాం. ప్రతిరోజూ సాయంత్రం సైకిళ్ళపై చుట్టుప్రక్కల వున్న గ్రామాలకు వెళ్ళి మెహెర్‌బాబా దివ్యత్వంపై ప్రసగాలు చేసేవాళ్ళం. గ్రామస్తులు శ్రద్ధగా ఆలకించేవారు. ఇదిఇలావుండగా, గుంటూరు సెంటర్ నిర్వాహకులలో ముఖ్యుడైన శ్రీ ఎన్.వి.రమణయ్య గారిని ఒక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని 1969 ఫిబ్రవరి 1న గుంటూరుకు వెళ్ళాం.

## బాబా దేహత్యాగం

**గుంటూరులో రైలు దిగి హొటల్‌లో కాఫీ త్రాగుతూ, ఆ రోజు న్యూస్ పేపర్‌లో మెహెర్‌బాబా** భౌతిక దేహ త్యాగం చేశారన్న వార్త చూశాను. ఆశ్చర్యమేసింది. నమ్మలేక పోయాను. రమణయ్య గారికి వెంటనే ఫోన్ చేసి చెప్పాను. నేను గుంటూరు వచ్చానని, ఇక్కడ పేపర్‌లో చదివిన విషయాన్ని ఆయనతో చెప్పాను. నన్ను వారింటికి రమ్మనమని చెప్పారు. మేం వారింటికి వెళ్ళేలోగా, శ్రీ రమణయ్య  బాబా కార్యదర్శి ఆదీ కె ఇరానితో ఫోన్‌లో మాట్లాడి ఈ వార్త నిజమని ఖరారు చేశారు. అనంతరం గుంటూరు నుండి ఒక ప్రైవేట్ బస్సు ఏర్పాటు చేశారు. శ్రీ ఎన్.వి.రమణయ్య, శ్రీ కనకయ్య, శ్రీ బి. సుబ్బారావు, పెదకాకాని తదితరులు మొత్తం 40 మంది గుంటూరు నుండి బయల్దేరారు.  మెహెరాబాద్‌కి బస్సులో వచ్చేవారందరూ బస్సు ఎక్కేముందరనే టిక్కెట్ చెల్లించాలని స్థానిక కార్యకర్తలు గట్టిగా హెచ్చరించారు. నాకు ఏం చేయ్యాలో

పాలుపోని స్థితి. డోలాయమానంలో వున్నాను. ఎందుకంటే, నేను అప్పటికింకా పూర్తిస్థాయి ఉద్యోగస్థుడ్ని కాదు. కాలేజి చదువు పూర్తిచేసుకున్న తొలిరోజులవి. ఏదైనా డబ్బులు కావాలంటే నాన్న గారి మీదే ఆధారపడ్డాను. అలాంటి రోజుల్లో నేను నరసరావుపేట నుండి గుంటూరు వచ్చాను. అలా వచ్చే ముందు మా నాన్న గారి దగ్గర కేవలం రూ. 10/– తీసుకున్నాను. అదే ఎక్కువనుకున్నాను. నిజానికి అంతకన్నా ఎక్కువ కావాలంటే ఏమౌతుందో కూడా నేను ఊహించగలను. ఆ రోజుల్లో రైలు టిక్కెట్ ధర కేవలం రూ 1.25 పైసలు ఉండేది.

**నాకూ ఆ బస్సులో వెళ్ళాలని వుంది. బాబా వారి ఆఖరి భౌతిక దర్శనం చేసుకోవాలని** వుంది. ఇలాంటి పరిస్థితుల్లో తిన్నగా స్థానిక పెద్ద పోస్టాఫీసుకు వెళ్ళాను. ఆ రోజుల్లో మొబైల్ ఫోన్లు లేవు కదా. ముందుగా మా నాన్న గారికి టెలిగ్రాం పంపాను. బాబా దర్శనార్థం మెహెరాబాద్‌కి గుంటూరు ప్రేమికులతో కలిసి వెళ్తున్నాను. మీరూ వెంటనే బయల్దేరండని చెప్పి టెలిగ్రాం ఇచ్చాను. ఆ టెలిగ్రాం ఇచ్చాక నా జేబులో కేవలం 7 రూపాయలున్నట్లు బాగా గుర్తు.

**అలా రోడ్డుపై నడుస్తుంటే పోస్టాఫీసు, శంకర విలాస్ సెంటర్లో ఒకచోట బంగారం, వెండి** వస్తువులు కుదవ పెట్టుకుంటామనే షరాబు దుకాణాలు కనిపించాయి. షరాబుకి నా చేతికున్న హెచ్‌యంటి వాచి, వేలికున్న బంగారు ఉంగరాన్ని అమ్మకానికి ఇచ్చేశాను. నాకు 150 రూపాయలు ఇచ్చాడు. దాంతో బస్సు టిక్కెట్ చెల్లించేశాను. ఆనాడు, నా మాదిరిగా, ఆ బస్సులో ప్రయాణించిన వారి ఆర్థిక కథనాలు ఒక్కొక్కరివి ఒక్కో రీతిన వున్నాయి. ఎందుకంటే, అనుకోకుండా, ఎలాంటి ముందస్తు ఏర్పాట్లు, ఆలోచనలు లేకుండా అతి తక్కువ సమయంలో ప్రయాణమవ్వాల్సి రావడమే ప్రధాన కారణం. కట్టుబట్టలుతో బయల్దేరాం కదా. షోలాపూర్‌లో బస్సు ఆగినప్పుడు, రెండు గళ్ళ లుంగీలు కొనుక్కుని, వాటితోనే కాలక్షేపం చేశాను. అలా ఫిబ్రవరి 2, 3 తేదీలలో బాబా దర్శనం చేసుకున్నాను. ఆ తర్వాత బస్సు పర్మిషన్లు ఇతర కారణాల వల్ల తిరుగు ప్రయాణమయ్యాం.

**ఆశ్చర్యం కల్గించే విషయం ఏమంటే, మెహెరాబాద్ నుండి తిరిగి వచ్చిన రెండ్రోజుల్లోనే** కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సమాచార, ప్రసారశాఖలో ఉన్నతాధికారిగా హైదరాబాద్‌లో ఉద్యోగపు ఉత్తర్వులు వచ్చాయి. అలా హైదరాబాద్‌లో ఉద్యోగంలో చేరి, హిమయత్ నగర్‌లో వున్న బాబా కేంద్రంలో, స్వామీ సత్యప్రకాశ్ ఉదాశీన్ గారితో కలిసి ఒక చిన్న గదిలో నా బస కుదుర్చుకున్నాను. ఆ దరిమిలా ఐ బి పరిధిలోని అకాశవాణిలో న్యూస్ ఎడిటర్‌గా, స్పెషల్ కరెస్పాండెంట్‌గా మిజోరం, హైదరాబాద్, న్యూ ఢిల్లీ తదితర అనేక ప్రాంతాల్లో పనిచేసి, పదవీ విరమణానంతరం మెహెరాబాద్‌లో స్థిరపడ్డాను. **అవతారుని లీలలు ఎన్నో, ఎన్నెన్నో చవిచూశాను. మెహెర్‌బాబా యుగావతారుడు.** ❊

## మెహెరాబాద్ నుండి యాత్ర

# హ్యాపీవ్యాలీ, గోరఖ్‌నాథ్ ఆలయం - సూపా..,

**(మా ప్రతినిధి)**

**మెహెరాబాద్‌కు ఉత్తరాన సుమారు 20 కిమీ దూరంలో హ్యాపీవ్యాలి, అక్కడి నుండి మరో** నాలుగైదు కిలో మీటర్ల దూరంలో గోరఖ్‌నాథ్ దేవాలయం ఉన్నాయి. అలాగే, మెహెరాబాద్‌కు దక్షిణాన, పూణే వెళ్ళే మార్గంలో, అహమ్మద్‌నగర్ శివార్ల నుండి సుమారు 15 కిమీ దూరంలో 'సూప' అనే చిన్న గ్రామం వుంది. హ్యాపీవ్యాలి, గోరఖ్‌నాథ్ ఆలయాలను  బాబా తన మండలితో పలుమార్లు సందర్శించారు. అలాగే, బాబా వారు నెరపిన నవజీవనంలో తొలి మజిలీ కేంద్రంగా సూప గ్రామం మెహెరీశంలో ప్రముఖంగా కనిపిస్తుంది.

**అవతారుని పాదస్పర్శతో పునీతమైన ఈ మూడు ప్రదేశాలను ఇటీవల 2026 ఆగస్టులో స్థానిక** ప్రేమికులతో కలిసి సందర్శించే అవకాశం మాకు చిక్కింది. ఆసక్తిగల పాఠకుల కోసం ఆ యాత్రా విశేషాలు ఇలా వున్నాయి. ముందుగా  గోరఖ్‌నాథ్ గురించి క్లుప్తంగా..

## గోరఖ్‌నాథ్ ఆలయం

మెహెరాబాద్ నుండి మెహెరాజాద్‌కు వెళ్ళే మార్గంలో ఒక ప్రక్కగా సుమారు ఐదారు కిలో మీటర్ల దూరం వెడితే, ఎత్తైన కొండపై గోరఖ్‌నాథ్ దేవాలయం దర్శనమిస్తుంది. ఆలయం చుట్టూతా ఎత్తైన కొండలు, లోతైన లోయలు, పచ్చని వృక్షాల సముదాయంతో కన్నులవిందుగా వుంది. గోరఖ్‌నాథ్ ఆలయం దాకా చక్కని రహదారి సౌకర్యం వుంది. కొంత దూరం ఘాట్ రోడ్డు ప్రయాణం కూడా చేయాలి. ఆలయ ప్రాంగణం పట్టణ రణగొణ ధ్వనులకు దూరంగా ప్రశాంతంగా, పరిశుభ్రంగా వుంది. ఇక్కడ ఆలయ దర్శనం తర్వాత హ్యాపీవ్యాలీకి బయల్దేరాం.

**గోరఖ్‌నాథ్ దేవాలయం గురించి మెహెరీశంలో ఇలా వుంది స్పష్టంగా...**

**1948 అక్టోబరులో బాబా స్త్రీ మండలి, అలాగే కొంతమంది పాశ్చాత్య ప్రేమికులతో కలిసి** హ్యాపీవ్యాలి, ఆ తర్వాత గోరఖ్‌నాథ్ దేవాలయాన్ని సందర్శించారు. ఈ దేవాలయం చుట్టూతా వున్న ఎత్తైన కొండల్ని అవతారుడు అవలీలగా ఎక్కారు. ఆలయ గర్భగుడిలో సుమారు 20 నిముషాలు ఏకాంతవాసం వున్నారు. **మెహెరీశం (ఆన్‌లైన్ పేజి 2673).**




గోరఖ్‌నాధ్ ఆలయ ప్రాంగణంలో

**అలాగే, మరో సందర్భంలో అవతారుడు ఈ ఆలయ సందర్శనకు సంబంధించి, స్త్రీ మండలి** సభ్యురాలైన కుర్షేద్ తన ఆత్మకథలో (ఫార్చునేట్ టు లవ్ హిమ్) ఇలా రాసుకున్నారు.

**"1949 ఫిబ్రవరిలో ఒక రోజున బాబా మమ్మల్ని మెహెరాజాద్‌కి దగ్గర్లో వున్న గోరఖ్‌నాధ్** దేవాలయానికి తీసుకువెళ్ళారు. దైవ దర్శనం అయ్యాక బాబా నాతో మాట్లాడుతూ ఒక ప్రత్యేక పనిని నాకు అప్పగిస్తున్నా అన్నారు. ఒక చంటి పిల్లవాడిని ప్రేమగా సాకాలన్నారు. ఆ తల్లి పిల్లవానికి ఏడు మాసాలకే జన్మనిచ్చి, ప్రసవం తర్వాత మరణించిందని చెప్పారు. ఆమె భర్త మెహెరాజాద్‌లో తోటమాలి. సుమారు ఆరు అంగుళాలు పొడవుతో అత్యంత బలహీనంగా జన్మించాడు ఆ పసికందు. వానికి గోరఖ్ అని బాబా పేరుపెట్టారు.

ఐతే, ఈ పిల్లవాని పాలనాపోషణ నా వల్ల కాదని గట్టిగా బాబాతో చెప్పాను. ఇది నాకే మాత్రం ఇష్టం లేదనీ చెప్పాను. నావల్ల కాదన్నాను. బాబా నా మాటలు ఆలకించ లేదు. బాబా ఆదేశాలను విధేయతతో పాటించాల్సిందే అన్నారు. అలా నా దగ్గరకు చేరిన ఆ బక్కపల్చని బాలుడు మూడునెలల్లో అందంగా బొద్దుగా తయ్యారయ్యాడు. ఒకరోజున అతని ముఖానికి సరదాగా కళ్ళజోడు పెట్టాను. అచ్చం గాంధీలాగా ఉన్నాడు. ఆ మాటనే నేను బాబాతో అంటే, బాబా చిరునవ్వులు చిందించారు. అతనొక గొప్ప ఆత్మ అన్నారు. జాగ్రత్తగా చూసుకో అన్నారు. బాబా ఆదేశాల ప్రకారం జాగ్రత్తగా పెంచాను.



## హ్యాపీవ్యాలీ

**అవతారుడు ఎంతగానో ఇష్టపడిన ప్రదేశం హ్యాపీవ్యాలీ. 1923-1952 నడుమ బాబా** ఈ ప్రాంతాన్ని పలుమార్లు సందర్శించారు. పచ్చనిచెట్లు, ఎత్తైన కొండలతో వుంటుందీ ప్రాంతం. లార్డ్ మెహెర్ ఆధారంగా చెప్పాలంటే బాబా ఈ ప్రాంతాన్ని తన స్త్రీ, పురుష మండలితో, ప్రేమాశ్రమ బాలురతో, పాశ్చాత్య బాబా ప్రేమికులతో కలిసి సుమారు 11సార్లుకు పైగా దర్శించారు. బాబా కాలి నడకన కూడా ఈ ప్రాంతాన్ని పలుమార్లు సందర్శించారు.

## హ్యాపీవ్యాలీలో శ్రీరాముడు

**పధ్నాలుగేళ్ళ వసవాస సమయంలో శ్రీరాముడు, సీతమ్మ, లక్ష్మణులతో కలిసి కొంతకాలం** హ్యాపీవ్యాలీలో బస చేశారని మెహెరీశంలో స్పష్టంగా పేర్కొన్నారు. అంతేకాదు, ఆనాడు ఇక్కడున్న కొండకోనల్లో నీటిధారలు లేకపోతే సీతమ్మ వారి దాహం తీర్చడానికై శ్రీరామచంద్రుడు కొండరాళ్ళపై విల్లు ఎక్కుపెట్టి మంచినీటిని తెప్పించాడని స్థలపురాణం చెప్తోంది.

**నేడిక్కడి పరిస్థితి పరిశీలిస్తే, ఇక్కడున్న శివాలయం వరకూ చక్కని రహదారి వుంది. గతంలో** నిటారుగా వున్న ఎత్తైన మెట్లు దిగవల్సి వచ్చేది. దీన్ని రామేశ్వరాలయం అనీ పిలుస్తారు. ఇక్కడ గర్భాలయంలో వున్న శివలింగాన్ని భక్తులు స్పృశించే అవకాశం వుంది. అలాగే, ఈ ఆలయానికి దగ్గరలో స్వచ్ఛమైన చిన్న నీటి కొలను వుంది. దీన్ని 'రామ్ కుండ్'అని, ఇది శ్రీరాముని కాలం నాటిదని స్థానికులు చెప్పారు. ఇందుకు సంబంధించిన సైన్‌బోర్డు ఇక్కడకు దగ్గర్లోనే వుంది. ఇక్కడ వున్న దేవస్థానం వారి భవనంలో చివరాఖరుగా వున్న గదిలో, ఒక సందర్భంలో బాబా వారు కొద్దిసేపు

విశ్రాంతి తీసుకున్నారని చెప్పారు. ఆలయ ప్రాంగణానికి చేరువలో సీతమ్మ వారు వుపయోగించిన జలధార వుంది. నేడు ఈ మార్గం పరిశుభ్రంగా లేదు. పిచ్చి మొక్కలతో నిండి వుంది.

## మెహెరీశం ఆన్‌లైన్‌లో

**1923 ఏప్రిల్ 30న హ్యాపీవ్యాలీకి వెళ్ళిన బాబా మండలి బృందం మూడు రోజులు అక్కడే** బస చేశారని, మే 3వ తేదీన ఉపాసనీ మహారాజ్ పుట్టినరోజుని అక్కడ ఘనంగా జరిపించారని మెహెరీశం తెలియజేస్తోంది. ఉపాసనీ పుట్టినరోజునాడు బాబా, అలాగే మండలివారు 24 గంటలు ఉపవాసం వున్నారు. అనంతరం, స్థానిక పేదలకు అన్నదానం చేశారు. అనంతరం ఆ రోజు రాత్రి పొద్దుపోయాక అహమ్మద్‌నగర్‌కి తిరిగి వచ్చారు.

**1924 మే 3న బాబా మండలి సభ్యులైన మున్షీ, సయ్యద్ సాహెబ్, రుస్తుంలతో కలిసి బాబా** హ్యాపీవ్యాలీ సందర్శించారు. ఆ సమయంలో బాబా భగవత్ చైతన్యం, సద్గురువులు – శిష్యులు గురించి విశేష ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. (మెహెరీశం పేజి 411).

**1928 మార్చి 4న మెహెరాబాద్‌లో నిర్వహిస్తున్న ప్రేమాశ్రమానికి సెలవు ప్రకటించారు.** ఆ రోజున బాబా మండలి, అలాగే, టీచర్లు, ప్రేమాశ్రమ బాలురందరితో కలిసి బాబా హ్యాపీవ్యాలీని సందర్శించారు. చిన్నారి ఆశ్రమ బాలల్ని వారికి ఇష్టమైన ఆటలు ఆడుకోమన్నారు. అవతారుడు కూడా వారితో కలిసి పలు ఆటల్లో పాల్గొన్నారు. బాబా బాలురితో కలిసి దగ్గర్లో వున్న ఎత్తైన కొండలు ఎంతో వేగంగా ఎక్కారని, ఆ పిదప అందరికీ షడ్రసోపేత విందు ఇచ్చారని తెలియజేస్తోంది మెహెరీశం (పేజి 917)

**1929 ఫిబ్రవరి 26, 27 తేదీలలో ప్రేమాశ్రమం బాలురితో కలిసి హ్యాపీవ్యాలీలో పలు ఆట పాటల్లో** బాబా పాల్గొన్నారు. అలాగే, దగ్గర్లో వున్న మంజుసుభా కొండలు ఎక్కారు. బాలలకు ఎన్నో ఆధ్యాత్మిక మర్మాలు తెలియజేశారు. (మెహెరీశం పేజి. 1015).

**1935 మే 15, 1940 మే 3న తీవ్ర ఎండాకాలం వేడిని తట్టుకోలేక బాబా బృందం మెహెరాబాద్ నుండి** హ్యాపీవ్యాలీని సందర్శించారు. (మెహెరీశం పేజి. 1677, 2101),

**మెహెరాబాద్, మెహెరాజాద్‌లలో నిర్వహించిన 'త్రీ ఇన్‌క్రెడిబుల్ వీక్స్' (1954 సెప్టెంబరు 11–30)**సమావేశానికి హాజరైన పాశ్చాత్య ప్రేమికలను సెప్టెంబరు 16న హ్యాపీవ్యాలీని సందర్శించమని బాబా ఆదేశించారు.

**ఇలా పలు సందర్భాలలో అవతారుని పాదస్పర్శతో పునీతమైంది హ్యాపీవ్యాలీ. వీలున్నవారు ఒకసారి సందర్శించాలనుకోవడం ముదావహం.**

# సూపా

అవతారుడు నెరపిన నవజీవన తొలి మజిలిలో సూపా గ్రామంలోనే బస చేశారు. ఆ వివరాలు ఇలా వున్నాయి. 1949 అక్టోబరు 15, శనివారం, బాబా, అనుచరులందరూ నవజీవన ప్రయాణానికి సిద్ధమయ్యారు. ఆ వేళ బాబా ఉదయాన్నే మెహెరాజాద్ నుండి మెహెరాబాద్‌కు వచ్చారు. నవజీవన యాత్రకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. **'నవజీవనానికి అంతా సిద్ధం'.** ఈ రోజు తనకెంతో ఆనందంగా ఉందన్నారు. ఇకపై నాకు ఎలాంటి బంధనాలు లేవు. రేపటి నుంచి నవజీవనం ప్రారంభ మౌతుందని, మనసారా నవ్వుతూ అన్నారు. ఆ రోజు ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమైంది. చిన్నగా ప్రారంభమైన వర్షం ఆ రాత్రంతా వర్షం కుంభవృష్టిగా కురిసింది. **"ఇదొక శుభ సంకేతం"** అని చరిత్రకారుడు **మెహెరీశంలో వర్ణించాడు.**

**నవజీవన బృందం ప్రారంభపు రోజైన 1949 అక్టోబరు 16వ తేదీన భారీ వర్షం కారణంగా,** మొదటి మజిలీ వరకూ బాబా కారులో వెళ్ళాలని సరోష్ ఇరాని, ఆదీ జూనియర్ తదితర మండలి సభ్యులు పట్టుబట్టారు. చివరిగా, బాబా అందుకు అంగీకరించారు.

**ముందుగా నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం, బాబా బృందం మెహెరాబాద్ నుండి కాలినడకన** బయల్దేరి, పూణే వెళ్ళే దారిలో, అహమ్మద్‌నగర్ నుండి ఏడు మైళ్ల దూరంలో వున్న 'చాస్' అనే గ్రామంలో తొలి బస చేయాలి. అందుకు తగిన అన్ని ఏర్పాట్లు చేశారు. ఐతే, గత రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా చాస్ గ్రామంలో ఏర్పాటు చేసిన బస ప్రాంతం బురదమయమైంది. పలుచోట్ల నీరు నిలిచింది. దాంతో, చాస్ నుండి ముందుకు, అంటే సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరం ప్రయాణించి, 'సూపా' అనే గ్రామానికి సాయంత్రం ఆరు గంటలకి చేరుకున్నారు. స్థానిక రహదారి బంగళాలో ఆ రాత్రికి నవజీవన బృందం బస చేశారు. బాబా, నలుగురు స్త్రీ మండలి ఎక్కిన కారుని పాద్రి డ్రైవ్ చేశాడు. మిగిలిన పురుష మండలిని రెండు దఫాలుగా ఆదీ జూనియర్ తన కారులో తీసుకొచ్చాడు. ఆ పిదప, పాద్రీ, ఆదీలను, వారి రెండు కార్లను తిప్పిపంపారు. ఆ రాత్రి సుపాలోని ధాక్ బంగళాలో బాబా ఒక డైనింగ్ టేబుల్‌పై పడుకున్నారు. ఏరుచ్ బాబాకు దగ్గరగా నేలపై పడుకున్నాడు. అన్నా 104 కాపలా ఉన్నాడు. ఇతర సహచరులందరూ గ్యారేజీలో పడుకున్నారు. స్త్రీలు బంగళాలో బస చేశారు.

ఆ **మరుసటి రోజు ఉదయం బాబా ఎంతో ప్రసన్న వదనంతో తన సహచరుల దగ్గరకు** వచ్చారు. కాకా అందరికీ టీ తయారు చేశాడు. **నవజీవన సహచరులతో బాబా మాట్లాడుతూ, "నా జీవితంలో ఎన్నడూ లేనంత ప్రశాంతంగా నిన్న రాత్రి చాలా మంచి నిద్ర పట్టిందన్నారు.** గతంలో ఉన్న 'బాధ్యతల' భారం ఏదీ లేకపోవడం వల్లే ఇన్నేళ్ళ

తర్వాత నేను ప్రశాంతంగా నిద్రపోగలిగానన్నారు. ఈ రోజు ఎంతో ఆనందంగా ఉందన్నారు. **'న్యూ లైఫ్ ప్రారంభం అద్భుతం'** అని ప్రకటించారు. నవజీవనం 100 శాతం నిరాశ, నిస్సహాయతలతో కూడిందన్నారు. ఇది ఎంత తీవ్రంగా ఉంటుందో వివరిస్తూ, దేవతలు సైతం దీనిని చూసి అసూయపడ తారన్నారు!


సూపాలో హనుమాన్

**చాస్ గ్రామంలో తొలి మజిలీ రద్దు అయినందున, ముందుగా అనుకున్నట్లు 'సూపాలోనే మరొక రోజు అదనంగా బస చేయాలని బాబా** నిర్ణయించారు. **ఆ మాదిరిగా 1949 అక్టోబరు 16 నుండి 18 వరకూ బాబా నవజీవన సహచరులు సూపా** గ్రామంలో బస చేశారు. ఈ సమయంలో తన సహచరులకు అనేక ఆధ్యాత్మిక విషయాలు వెల్లడించారు బాబా. అక్టోబరు 18న సూపా నుండి తదుపరి మజిలీ నారాయణగాంకు బయల్దేరారు.

## మరో జ్ఞాపకం

**1920 దశకంలో ఒక సందర్భంలో బాబా తన మండలితో కలిసి సూపా గ్రామంలో వున్న** శివాజీ మహారాజ్ కాలంనాటి హనుమాన్ దేవాలయాన్ని సందర్శించారని బాబా ప్రేమికుల కథనం. నేటికీ పూజలందుకుంటున్న ఈ పురాతన దేవాలయాన్ని ఇటీవల మా యాత్రలో సందర్శించాం.

**ఇలా ఆధ్యాత్మికతకు నెలవైన సూపా గ్రామాన్ని బాబా వారు తన నవజీవన ప్రారంభపు తొలి** మజిలీగా ఎంచుకున్నారు. సూపా గ్రామ విశేషాలను మనసారా స్మరించుకునేలా, వీలున్నవారు ఒకసారి సందర్శించే ప్రయత్నం హర్షణీయం.

***

# బాబాలో ఐక్యం



**కోఠి సెంటర్ శ్రీ నోరి వారి మూడవ కోడలు, శ్రీ నోరి రామ సుబ్బారావు గారి భార్య శ్రీమతి నోరి** వకుళ 2026 జూన్ 27న బాబాలో ఐక్యమయ్యారని ఆమె కుమార్తెలు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీమతి వకుళ నిరాడంబరంగా, బాబా నామస్మరణలో గడిపేవారని, బాబా భజన గీతాలను సాంప్రదాయ సంగీత భరితంగా ఆమె ఆలాపించేవారని స్థానిక బాబా ప్రేమికులు తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని బాబాని ప్రార్థించినట్లు తెలిపారు.



**శ్రీమతి చలసాని పద్మావతి గారు 2026 ఆగస్టు 23న స్వల్ప అస్వస్థతతో తుదిశ్వాస విడిచారు.** అమె బాబా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారని. బాబా కేంద్రం ఒక నిస్వార్థ కార్యకర్తను కోల్పోయామని, వారి ఆత్మకు శాంతి చేకూర్చేలా అవతారుడ్ని ప్రార్థించినట్లు, చల్లపల్లి కేంద్ర బాబా ప్రేమికులు ఒక ప్రకటనలో తెలిపారు.



**పార్వతీపురం బాబా ప్రేమికులు శ్రీ దొడ్లంగి వెంకటరావు మాస్టారు గారి భార్య శ్రీమతి** సుశీలమ్మ తీవ్ర గుండెపోటుతో 2026 సెప్టెంబరు 10 తెల్లవారుఝామున ఐక్యమయ్యారని బాబా ప్రేమికులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె భక్తిపూర్వకంగా, ఆర్ధ్రతతో అవతారుని భజన గీతాలను ఆలాపించేవారు. బాబా వారి సందేశాన్ని నిత్య జీవితంలో తు.చ. తప్పక ఆచరించ ప్రయత్నించిన అపూర్వమైన వ్యక్తిత్వం శ్రీమతి సుశీలమ్మ సొంతమని శ్రీ కొల్లి రామారావ్ అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలని బాబా వారిని ప్రార్థిస్తూ కొన్ని క్షణాలు మౌనం పాటించినట్లు స్థానిక బాబా కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది.

# చల్లపల్లి కేంద్ర 61వ వార్షికోత్సవం

**చల్లపల్లి బాబా కేంద్ర 61వ వార్షికోత్సవం సందర్భంగా 2026 ఆగస్టు 28, 29 తేదీలలో** స్థానిక మెహెర్‌బాబా రైస్ మిల్ ప్రాంగణంలో ప్రత్యేక ప్రేమిక సహవాస్ వైభవంగా నిర్వహించారు. తెలుగునాటగల పలు బాబా కేంద్రాల నుండి ప్రేమికులు పెద్దసంఖ్యలో సహవాస్‌లో పాల్గొన్నారు. ముందుగా స్థానిక బాబా కేంద్రం నుంచి అవతారుని నామ స్మరణతో నగర సంకీర్తన నిర్వహించారు.

**ముఖ్య అతిథిగా అవనిగడ్డ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ మండలి బుద్ధ ప్రసాద్** హాజరయ్యారు. ముందుగా, చల్లపల్లి కేంద్ర అధ్యక్షులు శ్రీ చుండూరు ప్రసాద్ ప్రేమికులకు స్వాగతం పలికారు. కార్యదర్శి శ్రీ పి.వి.రమణారావు నివేదిక సమర్పించారు. సహవాస్ కార్యక్రమాన్ని శ్రీ బాలగోపాల మెహెరీశా నిర్వహించారు.

**ఈ సందర్భంగా శ్రీ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, కలియుగంలో మనిషిలో ఉన్న** రాక్షసత్వం అంతం చేసేందుకు మెహెర్‌బాబా అవతరించారన్నారు. బాబా బోధించిన ప్రేమతత్వాన్ని ప్రతిఒక్కరూ అలవరచుకోవాలన్నారు. మెహెర్‌బాబా మౌనంతో తన సందేశాన్ని విశ్వవ్యాప్తం చేశారని ఉద్బోధించారు. శ్రీ చుండూరి మెహెర్ ప్రభాకరరావు బాబా వారి చిత్రపటం, బాబా సాహిత్యంతో శ్రీ మండలిని సత్కరించారు.

**రెండ్రోజుల సహవాస్ కార్యక్రమంలో బాబా ట్రస్టు సభ్యులు, శ్రీ యస్వీ ప్రసాద్‌రాజు, ఆంధ్ర** కేంద్రాల అధ్యక్షులు, శ్రీ బి. రామక్రిష్ణయ్య, కార్యదర్శి, శ్రీ తాడేపల్లి మెహెర్‌బాబా, శ్రీ టి. ప్రసన్న కుమార్, డాక్టర్ విజయసారధి, శ్రీ బి. కేశవరావు, శ్రీ కిలారు నాగార్జున, శ్రీ ఉడత్తు విజయకుమార్, శ్రీ కోసూరి మురళీ కృష్ణారావు, శ్రీమతి తాడేపల్లి శ్యామల తదితరులు బాబా వారి సందేశాలపై ప్రసంగించారు. మెహెర్ నృత్య నికేతన్ చిన్నారులు చి॥ చుండూరి మెహెరా, చి॥ చిన్నారి హరిణి ప్రదర్శించిన నృత్య రీతులు అలరించాయి.

**2026 ఆగస్టు నెలలో అవతారునిలో ఐక్యమైన శ్రీమతి ఓలేటి లక్ష్మికాంతం, శ్రీమతి చలసాని పద్మావతి (అవనిగడ్డ), శ్రీ అల్లంశెట్టి చిట్టెయ్యల ఆత్మకు శాంతి చేకూర్చాలని బాబావారిని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.**

## సత్సంగ్‌లు

**ఆగస్టు 2, ఉ. 5:30 నుండి 7 వరకు బాబా ఏకనామం శ్రీమతి కొప్పరపు సత్యవతి గారి** కుటుంబ సభ్యులచే నిర్వహించడమైంది. అలాగే, బాబా వారి సోదరి మణీజా బాబాలో ఐక్యమైన రోజుని స్మరించుకుంటూ బాబా కేంద్రంలో **ఆగస్టు 19**న ప్రత్యేక సత్సంగ్ నిర్వహించినట్లు కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.

# విజయనగరం




**2026 ఆగస్టు 16న మెహెర్‌బాబా వారి ఏకనామం ఉదయం 7 నుండి సా. 7 వరకు** నిర్విఘ్నంగా నిర్వహించినట్లు కేంద్ర అధ్యక్షులు శ్రీ కామేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏకనామంలో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల పరిధిలో పలు బాబా కేంద్రాల నుండి ప్రేమికులు సుమారు 200 మంది పాల్గొన్నారు.

---

## మెహెర్‌బాబా పత్రిక
## ముద్రణ, రవాణా ఖర్చులు

**పత్రిక ముద్రణ, రవాణా, నిర్వహణ ఖర్చులు అనూహ్యంగా పెరిగిన దృష్ట్యా 1. వార్షిక సభ్యత్వం రూ. 150/-, 2. జీవిత సభ్యత్వం రూ. 2,000/- గా మార్పు చేయడమైంది.** ప్రస్తుతం వున్న జీవిత సభ్యులు, అంటే ఇంతక్రితం వెయ్యి రూపాయలు మాత్రమే చెల్లించిన వారు కూడా, వీలున్న మేరకు, మా ప్రతిపాదనను మన్నించి అదనపు వెయ్యి రూపాయలు మీ వీలువెంబడి పత్రిక చిరునామాకు పంపవల్సిందిగా కోరుతున్నాం. మా ఈ విజ్ఞప్తిని మన్నించి ఇప్పటికే చాలా మంది అదనపు వెయ్యి రూపాయలు చొప్పున పంపుతున్నారు. జీవిత సభ్యుల చెల్లింపుల వివరాలు ప్రతినెలా పేజి 40లో ప్రచురిస్తున్నాం. మీ సహకారం కోరుతూ, మీ సూచనలు, సలహాలు, మా వాట్సప్ నంబర్ 99595 53218 తెలియజేయగలరు.

# శ్రీకాకుళం కేంద్ర 65వ వార్షికోత్సవం



**అవతార్ మెహెర్‌బాబా శ్రీకాకుళం కేంద్ర 65వ వార్షికోత్సవ సందర్భంగా ప్రత్యేక ప్రేమిక** సహవాస్ 2026 ఆగస్టు 23న ఉదయం 5 నుండి మధ్యాహ్నం 1.30 వరకు అత్యంత వైభవంగా నిర్వహించినట్లు కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా తెల్లవారు ఝామున 5 నుండి సుమారు ఒక గంటసేపు బాబా వారి నామస్మరణతో నగర సంకీర్తన, అనంతరం, సప్తవర్ణ పతాకావిష్కరణ నిర్వహించడమైంది. శ్రీ కొల్లి రామారావు సప్తవర్ణ పతాకాన్ని అవిష్కంచారు. కేంద్ర మెహెర్ దర్బార్‌లో జరిగిన ప్రేమిక సహవాస్‌లో శ్రీ బుడుమూరు శ్రీరామమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాగా, శ్రీ తోట నాగేశ్వర రావు బాబా వారిచ్చిన సత్య ప్రేమ సందేశాలపై అనర్గళంగా ప్రసంగించారు. బాబా ప్రేమికులు భజన గీతాలను ఆలాపించారు. శ్రీ సుందరాపల్లి అప్పారావు సహవాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా, శ్రీకాకుళం బాబా కేంద్రం తరఫున అర్హత గల ఒక పేద విద్యార్థికి రూ.10,000/- ఆర్థిక సహాయం అందజేయడమైంది. ఈ విషయమై స్థానిక రోటరీ క్లబ్ వారి సహాయం కోరినట్లు తెలిపారు. ప్రేమికులకు ప్రేమ ప్రసాద వితరణతో సహవాస్ దిగ్విజయంగా ముగిసింది. రమారమిన 650 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ పిదప, నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 65 మందికి నేత్ర పరీక్షలు జరిపి, అవసరమైన 13 మందికి శస్త్ర చికిత్సలు చేయడమైంది.

## జి. సిగడాం కేంద్ర 19వ వార్షికోత్సవం

శ్రీకాకుళం జిల్లా జి. సిగడాం కేంద్ర 19వ వార్షికోత్సవం సందర్భంగా 2026 సెప్టెంబరు 27, ఆదివారం నాడు ఉదయం 7 నుండి మ. 1.30 వరకూ ప్రత్యేక ప్రేమిక సహవాస్ నిర్వహిస్తున్నట్లు స్థానిక బాబా కేంద్ర ప్రేమిక బృందం ఆహ్వానం పంపారు. మరింత సమాచారం కోసం మొబైల్ 9849870859, 9949160282 సంప్రదించగలరు.

# ప్రభుస్తుతి

ఓ పర్వర్దిగార్,
సర్వపోషకా! సర్వరక్షకా!
నీవు ఆదియును
అంతమును లేనివాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములులేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ
నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ
పురుషుడవు,
సర్వోన్నతుడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మావు,
పరమాత్మవు, అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
**నీవు 'ఈజద్' అనబడు**
**ఏకైక పూజ్యుడవు.**

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసిన
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో,
మాటలలో
చేతలలో
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# మా ప్రచురణలు




























ప్రతులకు ఫోన్ : **99595 53218** సంప్రదించగలరు

చిత్రమాలిక

# చల్లపల్లి కేంద్ర 61వ వార్షికోత్సవం

## 2026 ఆగస్టు 29, 30













---

# కమల్ వివాహం



శ్రీ వల్లూరి మెహెర్ ప్రసాద్, శ్రీమతి అనూరాధా గారి కుమారుడు శ్రీ మెహెర్ కమల్ వివాహం శ్రీ పి. శ్రీనివాసరావు, శ్రీమతి నీరజ గార్ల ఏకైక పుత్రిక చి.ల.సౌ. మెహెర్ సరళతో మెహెరాబాద్‌లో 2026 సెప్టెంబరు 7వ తేదీ ఉదయం 7 గంటలకు బాబా వారి సమాధి దగ్గర ప్రార్థనల అనంతరం, టిన్ షెడ్ ప్రాంగణంలో నిరాడంబరంగా, బాబా ప్రేమికుల సమక్షంలో జరిగింది. అనంతరం స్థానిక హోటల్‌లో వేడుకగా అవతారుని భజన గీతాలు, పెళ్ళి విందు ఏర్పాటు చేశారు.

బాబా ప్రేమికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# జీవిత సభ్యత్వం

**2026 ఆగస్టు - సెప్టెంబర్ నెలలలో పంపిన వారి వివరాలు**

| | | |
|---|---|---|
| 1. | శ్రీ జి. వేణుగోపాల్, మెహెరాబాద్ | రూ. 1000/- |
| 2. | శ్రీ ఏ. సోమశేఖర్, మెహెరాబాద్ | రూ. 1000/- |
| 3. | శ్రీ జి.యస్.జె.బి. బాబాజి, మెహెరాబాద్ | రూ. 1000/- |
| 4. | శ్రీ ఎల్. మోహనరావు, శిఖబడి | రూ. 1000/- |
| 5. | శ్రీ యన్. ముత్యాలరావు, పద్మారావ్‌నగర్, సికింద్రాబాద్ | రూ. 1000/- |
| 6. | డాక్టర్ వై. విజయసారథి, తాడేపల్లిగూడెం | రూ. 1000/- |

**మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 2000/-.**
**ఆన్‌లైన్‌లో పంపగోరువారు** శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000029152, IFSC CODE: IOBA 0001732.**

**మెహెర్‌బాబా పత్రిక వార్షిక సభ్యత్వం రూ. 150/-.**
**ఆన్‌లైన్‌లో పంపగోరువారు** శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000027973, IFSC CODE: IOBA 0001732.**

సభ్యత్వం పోస్టులో మనీ ఆర్డర్, బ్యాంకు చెక్కు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగోరువారు ఈ క్రింది పోస్టలు అడ్రస్సుకు పంపవల్సింది.


**మా అడ్రస్:**
**ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్,**
**బాబాస్ హౌస్,** యాప్రాల్, ప్లాట్ నెం. 32, జె.జె. నగర్ కాలనీ పోస్టు,
సికింద్రాబాద్-500087.
ఫోన్: **99595-53218.** **email: malladisukku@gmail.com**



Printed and published and owned by Dasika Nirmaladevi printed at Caxton Printers, Lakdi-ka -Pul, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad. **Editor: D. Nirmaladevi**

**RNI No. APTEL/2002/07310, Posted at Patrika Channel, Nampally, Hyderabad.**